JAYABHERIDAILY.COM
జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రభాత జయభేరి
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
మేడ్చల్ - మల్కాజిగిరి । బుధవారం 04-02-2026
Medchal - Malkajgiri । Wednesday 04-02-2026
Follow: jayabherinews
సంపుటి : 02 । సంచిక : 249
పేజీలు : 8 । వెల : 5
Vol. 02 । Issue 249 । Pages : 8 । ₹: 5

విలేకర్లు కావలెను
మీకు జర్నలిజంలో ఆసక్తి ఉందా?
సమస్యల్ని ప్రశ్నించేందుకు సరైన అస్త్రం కోసం ఎదురు చూస్తున్నారా?
మీకు అవకాశం కల్పించేందుకు మేము సిద్ధంగా ఉన్నాం..!
ప్రభుత్వానికి ప్రజలకి మధ్య వారధిగా ఉంటూ..
డిజిటల్ మీడియా రంగంలో సరికొత్త హంగులతో మీ అరచేతిలో...
"జయభేరి" తెలుగు దినపత్రిక.. నీకో చక్కని వేదికగా నిలుస్తుంది...
9391 544 889
call me
jayabheripaper@gmail.com


# లోక్‌సభలో చైనా అంశంపై రచ్చ

## స్పీకర్ టేబుల్ ఎక్కిన కాంగ్రెస్ ఎంపీలు - వాయిదా



**జయభేరి, న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3 :**

పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల రెండో రోజు మంగళవారం లోక్‌సభలో తీవ్ర గందరగోళం నెలకొంది. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై చర్చ సందర్భంగా ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చైనా సరిహద్దు వివాదాన్ని మరోసారి ప్రస్తావించడంతో సభలో ఒక్కసారిగా ఉద్రిక్తత ప్రారంభమయింది. మాజీ ఆర్మీ చీఫ్ ఎం.ఎం. నరవాణే రాసినట్లుగా చెబుతున్న ప్రచురించని పుస్తకంలోని అంశాలను రాహుల్ ప్రస్తావించడాన్ని బీజేపీ ఎంపీలు తీవ్రంగా అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో ఇరుపక్షాల మధ్య వాగ్వాదం జరగడంతో స్పీకర్ ఓం బిర్లా సభను మధ్యాహ్నం 3 గంటల వరకు వాయిదా వేశారు. కాంగ్రెస్ సభ్యులు స్పీకర్ ముందు ఉన్న టేబుల్ ఎక్కిన నిరసన వ్యక్తం చేశారు. రాహుల్ కు మాట్లాడే అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆక్సాయ్ చిన్ ప్రాంతాన్ని కాంగ్రెస్ ప్రభుత్వమే 1962లో చైనాకు అప్పగించిందని.. కాంగ్రెస్ దేశానికి క్షమాపణ చెప్పాలని బీజేపీ డిమాండ్ చేస్తోంది. అంతకుముందు, ఉదయం జరిగిన ఎన్డీయే పార్లమెంటరీ పార్టీ సమావేశంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ఘన స్వాగతం లభించింది. అమెరికాతో కుదిరిన చారిత్రాత్మక వాణిజ్య ఒప్పందం దేశానికి ఎంతో ప్రయోజనకరమని పేర్కొంటూ ఎన్డీయే ఎంపీలు ప్రధానిని ఘనంగా సత్కరించారు. డొనాల్డ్ ట్రంప్ నేతృత్వంలోని అమెరికా ప్రభుత్వం దిగుమతి సుంకాలను 18 శాతానికి తగ్గించడం మోదీ దౌత్య విజయం అని ఈ సందర్భంగా నేతలు కొనియాడారు. రాష్ట్రపతి ప్రసంగంపై చర్చకు సంబంధించి లోక్‌సభలో మొత్తం 18 గంటల సమయాన్ని కేటాయించారు. ఈ చర్చ ముగిసిన అనంతరం ఫిబ్రవరి 4న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సమాధానం ఇవ్వనున్నారు. అలాగే, కేంద్ర బడ్జెట్‌పై జరిగే చర్చకు సంబంధించి ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఫిబ్రవరి 11న తన వివరణ ఇవ్వనున్నట్లు అధికారిక వర్గాలు వెల్లడించాయి. మంగళవారం ఉదయం ప్రశ్నోత్తరాల సమయంలోనూ విపక్షాల నినాదాలతో సభ హోరెత్తింది. వివిధ అంశాలపై చర్చకు పట్టుబడుతూ ప్రతిపక్ష సభ్యులు వెల్‌లోకి దూసుకెళ్లడంతో సభ సజావుగా సాగలేదు. అటు రాజ్యసభలోనూ వాణిజ్య ఒప్పందంపై పూర్తి వివరాలు వెల్లడించాలని కాంగ్రెస్ పట్టుబట్టింది. అయితే, ప్రభుత్వం అన్ని వివరాలను సభ ముందు ఉంచుతుందని సభా పక్ష నేత జేపీ నడ్డా స్పష్టం చేశారు.



# చట్టం ప్రకారం ఎన్నికలను నిర్వహించాలి

- వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పోలీస్ అధికారులతో డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ బి.శివధర్ రెడ్డి

**జయభేరి, హైదరాబాద్, ఫిబ్రవరి 3:**

మున్సిపల్ ఎన్నికలను చట్టం ప్రకారం సమర్థవంతంగా నిర్వహించాలని రాష్ట్ర డైరెక్టర్ జనరల్ అఫ్ పోలీస్ బి.శివధర్ రెడ్డి పోలీస్ అధికారులతో అన్నారు. మున్సిపల్ ఎన్నికల

...మిగతాది 2 లో

# ఎట్టకేలకు ట్రేడ్ డీల్



- అమెరికాతో వాణిజ్య ఒప్పందంపై ఎన్డీయే ఎంపీలకు ప్రధాని
- సహనమే భారత్ ను గెలిపించిందన్న మోదీ
- ట్రంప్ ప్రకటనల వెనుక దాగివున్న అజెండా
- భారత్, అమెరికా మధ్య కుదిరిన కీలక వాణిజ్య ఒప్పందంపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, లోక్‌సత్తా పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ జయప్రకాశ్ నారాయణ హర్షం

...మిగతాది 2 లో



2 లో

# ముఖం చాటేసిన సీఎం రేవంత్

- అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదే 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని అడ్డదారిలో గద్దెనెక్కిన రేవంత్
- రెండు లక్షల నియామకాలు చేపట్టకపోతే ప్రభుత్వాన్ని దించేయండని ఢిల్లీ నుంచి వచ్చి మరీ చెప్పిపోయిన ప్రియాంక గాంధీ
- కేసీఆర్ హయాంలో చివరి దశలో ఉన్న 65 వేల ఉద్యోగాలకు నియామక పత్రాలు ఇచ్చి ఫోటోలకు ఫోజులు కొట్టిన సీఎం
- తెలంగాణ నిరుద్యోగులను నమ్మించి నయవంచన చేసినందుకు ముఖ్యమంత్రి ముక్కున వేలేసుకుని క్షమాపణలు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**జయభేరి, హైదరాబాద్, ఫిబ్రవరి 3 :**

రెండు లక్షల ఉద్యోగాలు మొదటి ఏడాదిలోనే అని ఇచ్చిన మరో గ్యారెంటీ నుంచి నిస్సిగ్గుగా ముఖం చాటేసిన ముఖ్యమంత్రిని చూసి తెలంగాణ నిరుద్యోగుల ఆగ్రహం కట్టలు తెంచుకుంటున్నదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. తెలంగాణభవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కేటీఆర్ మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదే 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని అడ్డదారిలో గద్దెనెక్కిన రేవంత్.. తీరా అది ఐదేళ్ల హామీ అని, పీసీసీ చీఫ్‌తో సీఎం పలికిస్తున్న చిలుక పలుకులు చూసి యువతరం ఛీ కొడుతోందని అన్నారు. తొలి సంవత్సరమే రెండు లక్షల నియామకాలు చేపట్టకపోతే ప్రభుత్వాన్ని దించేయండని ఢిల్లీ నుంచి వచ్చి మరీ చెప్పిపోయిన ప్రియాంక గాంధీ మాట అమలై ఉంటే.. ఈ దగాకోరు సర్కారు కుప్పకూలి ఇప్పటికే ఏడాది పూర్తయ్యేదన్నారు కేటీఆర్. కేసీఆర్ హయాంలో చివరి దశలో ఉన్న 65 వేల ఉద్యోగాలకు నియామక పత్రాలు ఇచ్చి ఫోటోలకు ఫోజులు కొట్టిన సీఎం, ఆ తరువాత మొత్తానికే చేతులెత్తేయడంతోనే తెలంగాణలో 'రిక్రూట్‌మెంట్ జీరో'గా మారిపోయిందని కాంగ్రెస్ ఉద్యోగాల భర్తీ ప్రక్రియను ఎండగట్టారు.



# నెయ్యి కల్తీపై ఏపీ కేబినెట్ సీరియస్

- శ్రీవారి నెయ్యి కల్తీపై కేబినెట్ సుదీర్ఘ సమీక్ష
- సీబీఐ నివేదికలోని అంశాలపై మూడున్నర గంటల చర్చ
- గత ప్రభుత్వ హయాంలో భారీ అక్రమాలు జరిగాయన్న మంత్రులు
- దోషులపై చర్యలకు ఉన్నతస్థాయి కమిటీ ఏర్పాటుకు నిర్ణయం
- తిరుమల పవిత్రతను కాపాడటమే లక్ష్యమని స్పష్టం చేసిన ప్రభుత్వం

**జయభేరి, తిరుపతి, ఫిబ్రవరి 3 :**

కలియుగ దైవం తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి లడ్డూ ప్రసాదం తయారీలో నెయ్యి కల్తీ వ్యవహారంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని రాష్ట్ర కేబినెట్ తీవ్రంగా స్పందించింది. మంగళవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఇతర అజెండా అంశాలను పక్కనపెట్టి, కేవలం ఈ అంశంపైనే సుమారు మూడున్నర గంటల పాటు సుదీర్ఘంగా చర్చించింది. కోట్లాది మంది హిందువుల మనోభావాలతో ముడిపడిన ఈ వ్యవహారంలో దోషులు ఎంతటి వారైనా కఠిన చర్యలు తీసుకోవాలని, తిరుమల పవిత్రతను కాపాడటమే ప్రభుత్వ ప్రథమ కర్తవ్యమని కేబినెట్ అభిప్రాయపడింది. సీబీఐ సిట్ ఇచ్చిన నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు చేపట్టేందుకు ఒక ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేయాలని కీలక నిర్ణయం తీసుకుంది. సమావేశం అనంతరం మంత్రులు కొలుసు పార్థసారథి, పయ్యావుల కేశవ్, నాదెండ్ల మనోహర్, సత్యకుమార్ యాదవ్ మీడియా సమావేశంలో కేబినెట్ చర్చల

...మిగతాది 2 లో



2 లో

# దూకుడు పెంచిన బీజేపీ

- మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికలకు తెలంగాణకి బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్

**జయభేరి, హైదరబాద్ :**

తెలంగాణలో జరగనున్న మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికలకు బీజేపీ దూకుడు పెంచింది. పార్టీ అగ్ర నేతలు పార్టీ ప్రచారానికి వస్తున్నారు.



2 లో

# దేశాన్ని అమెరికాకు అమ్మేశారు

- రాహుల్ గాంధీ

**జయభేరి, న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3 :**

ఆమెరికా, భారత్ మధ్య కుదిరిన వాణిజ్య ఒప్పందంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. ప్రధాని మోదీ.. దేశాన్ని అమెరికాకు అమ్మేశారని రాహుల్ మండిపడ్డారు. అమెరికా ఒత్తిడితో ప్రధాని మోదీ వణికిపోయారని అన్నారు.



# మాజీ మంత్రి రజినిపై మరో కేసు

**జయభేరి, చిలకలూరిపేట :**

మాజీ మంత్రి విడదల రజినీ పై ఎడ్లపాడు పోలీస్ స్టేషన్ లో మరో కేసు నమోదు అయింది. గత నెల 30 వ తారీఖున ఎడ్లపాడు మండలం బోయపాలెం వెంకటేశ్వర స్వామి దేవాలయంలో మాజీ మంత్రి రజిని ,వైఎస్ఆర్సిపి నేతలు ప్రత్యేక పూజలు జరిపారు. అప్పుడు జరిగిన తోపులాట, ఘర్షణ పై షేక్ రాజా అహ్మద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మాజీ మంత్రి రజినిపై ఎడ్లపాడు పోలీసులు కేసు నమోదు చేసారు. రజిని, మరోక 21 మందిపై కేసు నమోదు అయింది.

▸▸ మొదటిపేజీ తరువాయి

## ముఖం చాటేసిన సీఎం రేవంత్

అప్పటికే లక్షా 65 వేల ఉద్యోగాలను భర్తీ చేసిన బీఆర్ఎస్ ప్రభుత్వం పై పగబట్టుకుని రేవంత్ చల్లిన బురద అంతా అబద్ధాలతో అందలం ఎక్కడానికేనని అందరికీ అర్థమైపోయిందని, పట్టమని 10 వేల కొత్త ఉద్యోగాలకు కూడా నోటిఫికేషన్లు ఇవ్వని చేతకాని దద్దమ్మ పాలన చూసి నిరుద్యోగులే కాదు, వారి తల్లిదండ్రులు కూడా దుమ్మెత్తి పోస్తున్నారన్నారు. జాబ్ క్యాలెండర్‌ను పాతరేసి, వరుస కుంభకోణాలతో రేవంత్ సర్కారు జేబులు నింపుకుంటున్న తీరును నిత్యం తెలంగాణ సమాజం గమనిస్తూనే ఉందని, రెండు లక్షల ఉద్యోగాల హామీపై నాలుక మడతేసినంత మాత్రాన నాలుగు కోట్ల ప్రజలు ఊరుకుంటారని, ముఖ్యమంత్రి చేసిన మోసాన్ని మరిచిపోతారని అనుకుంటే అది పొరపాటే అని హెచ్చరించారు. తెలంగాణ నిరుద్యోగులను నమ్మించి నయవంచన చేసినందుకు ముఖ్యమంత్రి ముక్కును నేలకేసి రుద్ది క్షమాపణలు చెప్పినా, సాష్టాంగ దండాలు పెట్టినా క్షమించే ప్రసక్తే లేదని, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిరుద్యోగులకు, విద్యార్థులకు చేస్తున్న ఈ ద్రోహంపై వెంటాడుతామన్నారు.

**మీరు చేసిన పాపం ఊరికే పోదు..**

మేధావుల ముసుగు వేసుకుని మాయమాటలతో మభ్యపెట్టిన గొంతులన్నీ గత రెండేళ్ల నుంచి మూగబోయినంత మాత్రాన మీరు చేసిన పాపం ఊరికే పోదని, నిరుద్యోగులకు, యువతకు అందాల్సిన బాధ్యత ఉందన్నారు కేటీఆర్. కేవలం నిరుద్యోగులను మాత్రమే కాకుండా రాష్ట్రంలోని అన్ని వర్గాలను రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందన్నారు. ఇప్పటికే మూడు దఫాలుగా రైతుబంధు ఎగ్గొట్టి 70 లక్షల మంది అన్నదాతల పొట్ట కొట్టారు. కేసీఆర్ పాలనలో ఆత్మగౌరవంతో బతికిన రైతన్నను మళ్లీ అప్పులపాలు చేసి తీరని ద్రోహం చేశారని తెలిపారు. సీఎం సీటుపై కూర్చున్న మరుక్షణంలోనే ప్రతి మహిళకు రూ.2500 ఇస్తానని చెప్పిన మాటలకు రెండేళ్లయినా ఒక్కరికీ దిక్కులేకపోవడంతో ఆడబిడ్డలు కోపంతో రగిలిపోతున్నారన్నారు. ఆరు గ్యారెంటీలన్నీ అక్షరాలా గారడీలేనని, 420 హామీలన్నీ నయవంచన మాత్రమేనని తన నిజస్వరూపాన్ని బయటపెట్టిన రేవంత్ సర్కారుకు నిరుద్యోగుల ఉసురు తగలడం ఖాయం అన్నారు. మెగా డీఎస్సీ పేరిట దగా, నిరుద్యోగ భృతి పేరిట చేసిన ద్రోహానికి గుణపాఠం చెప్పేందుకు ఆదిలాబాద్ నుంచి అశోక్ నగర్ చౌరస్తా వరకు ప్రతి నిరుద్యోగి సిద్ధంగా ఉన్నాడని తెలిపారు. చైతన్యానికి ప్రతీకైన తెలంగాణ యువత సంఘటిత శక్తికి ఉన్న బలం ఏంటో, వారు బిగించే పిడికిళ్లు కాంగ్రెస్ పునాదులను ఎలా పెకిలిస్తాయో త్వరలోనే చూస్తామని కేటీఆర్ తెలిపారు.

## దూకుడు పెంచిన బీజేపీ

బుధవారం బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ వస్తున్నారు. ఈ నెల 7న మహారాష్ట్ర సీఎం ఫడ్నవీస్, 8న కేంద్ర హోం మంత్రి అమిత్ తెలంగాణ పర్యటన ఖరారయింది. నితిన్ నబిన్ బుధవారం మహబూబ్‌నగర్ లో ఏర్పాటు చేసిన బహిరంగ సభకు ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు. మధ్యాహ్నం 1 గంటకు శంషాబాద్ విమానాశ్రయంకు చేరుకుంటారు. మధ్యాహ్నం 1:30 గంటలకు శంషాబాద్ నుండి మహబూబ్ నగర్ కు చేరుకుంటారు. తిరిగి సాయంత్రం సాయంత్రం 5:45 గంటలకు శంషాబాద్ ఎయిర్ పోర్ట్ నుండి ఢిల్లీ కి వెళ్లనున్నారు.

## దేశాన్ని అమెరికాకు అమ్మేశారు

నాలుగు నెలలుగా నిలిచిన ఒప్పందంపై మోదీ సంతకం చేశారని.. మోదీపై వచ్చిన తీవ్ర ఒత్తిడి వల్లే సంతకం చేశారని పేర్కొన్నారు. అమెరికా ఒత్తిడితో ఒప్పందంపై మోదీ రాజీ పడ్డారని అన్నారు. ప్రజల కష్టార్జితాన్ని మోదీ అమెరికాకు దోచిపెట్టారని ధ్వజమెత్తారు. అమెరికా బయటపెట్టని ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో చాలా విషయాలు ఉన్నాయని రాహుల్ అన్నారు. అమెరికాలో అదానీపై కేసు ఉందని.. వాస్తవానికి ఆ కేసు మోదీపై పెట్టాల్సిన కేసు అని పేర్కొన్నారు. ఎప్‌స్టీన్ ఫైల్స్ విషయంలో మోదీపై చాలా ఒత్తిడి ఉందన్నారు. ప్రధాని అమెరికాకు ఎందుకు లొంగిపోయారన్నది ప్రజలు అర్థం చేసుకోవాలని తెలిపారు.

## చట్టం ప్రకారం ఎన్నికలను..

సందర్భంగా మంగళవారం నాడు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మున్సిపల్ ఎన్నికలు జరగనున్న ప్రాంతాల పోలీస్ కమీషనర్లు , జిల్లాల ఎస్పీలు, స్టేషన్ హౌస్ ఆఫీసర్లు (ఎస్హెచ్ఓ) లతో మాట్లాడారు. రాష్ట్రంలోని 7 మున్సిపల్ కార్పొరేషన్లు, 116 మున్సిపాలిటీలలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో కొత్తగూడెం, కరీంనగర్, మహబూబ్‌నగర్, మంచిర్యాల, నిజామాబాద్, నల్గొండ, రామగుండం కార్పొరేషన్ల పరిధిలోని 414 వార్డులతో పాటు, 116 మున్సిపాలిటీల్లోని 2582 వార్డుల్లో ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించాలని పోలీస్ అధికారులకు సూచించారు. ఈనెల 11వ తేదీన పోలింగ్, 13 తేదీన కౌంటింగ్ జరగనున్న నేపథ్యంలో నిబంధనల ప్రకారం ఎన్నికలు నిర్వహించి రాష్ట్ర పోలీస్ శాఖకు, ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని డిజిపి సూచించారు. ఏ రకమైన ఫిర్యాదులు గాని ,అవాంఛనీయ సంఘటనలు గాని జరగకుండా చర్యలు తీసుకోవాలని డిజిపి స్పష్టం చేశారు.నిబంధనల మేరకు కఠినంగా వ్యవహరించాలని డిజిపి పోలీస్ అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ పోలీస్ లీగల్ అడ్వైజర్ శ్రీ రాములు ఎన్నికల నిర్వహణకు సంబంధించిన చట్టాల గురించి సమావేశంలో వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ....చట్టం ప్రకారం ఓటర్లను ప్రభావితం చేయడం, ఒకరికే ఓటు వేయాలని ఒత్తిడి తీసుకురావడం లేదా నామినేషన్ వేయకుండా అడ్డుకోవడం వంటి చర్యలకు పాల్పడితే కఠిన శిక్షలు తప్పవని, బాధితులపై సామాజికంగా లేదా ఆర్థికంగా బహిష్కరణలు విధిస్తే చట్టరీత్యా కఠినంగా వ్యవహరించాల్సి ఉంటుందన్నారు. అదేవిధంగా శాంతియుత వాతావరణాన్ని దెబ్బతీసేలా మద్యం పంపిణీ చేసినా, ఎక్సైజ్ చట్టంలోని నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినా కనీసం ఆరు నెలల నుంచి రెండేళ్ల వరకు జైలు శిక్ష పడే అవకాశం ఉందనీ ,ఆయుధాల చట్టం ప్రకారం లైసెన్స్‌డ్ ఆయుధాలను కలిగి ఉన్న వారు నిబంధనల మేరకు పోలీస్ స్టేషన్లలో జమ చేయాలని, లేనిపక్షంలో ఒక ఏడాది నుంచి మూడేళ్ల వరకు కఠిన కారాగార శిక్ష విధించాలని నిబంధనలు ఉన్నాయన్నారు. బహిరంగ ప్రదేశాల డిస్ఫిగర్మెంట్ చట్టం1997ను అనుసరించి ఎవరైనా అనుమతి లేకుండా గోడలపై పోస్టర్లు అంటించినా, అశ్లీల ప్రకటనలు ప్రదర్శించినా వాటిని తొలగించడమే కాకుండా సంబంధిత వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేయవచ్చని, ధ్వని కాలుష్యాన్ని నియంత్రించేందుకు టౌన్ న్యూసెన్స్ చట్టాన్ని కఠినంగా అమలు చేయాల్సి ఉందన్నారు. పోలీసు అధికారుల ముందస్తు అనుమతి లేకుండా బహిరంగ ప్రదేశాల్లో లౌడ్ స్పీకర్లు వాడటం చట్టరీత్యా నేరం. ప్రచార వాహనాల విషయంలోనూ మోటార్ వాహనాల చట్టం1988 కింద అనేక ఆంక్షలు అమల్లో ఉన్నాయనీ, ఎన్నికల ప్రచారానికి ఉపయోగించే వాహనాలకు రిటర్నింగ్ అధికారి నుంచి ముందస్తు అనుమతి తప్పనిసరి అని, ఆ అనుమతి పత్రం యొక్క ఒరిజినల్ కాపీని వాహనం ముందు భాగంలో ప్రదర్శించాలన్నారు. మతపరమైన సంస్థలు, ప్రార్థనా మందిరాలను రాజకీయ ప్రయోజనాల కోసం, పార్టీ ప్రచారాల కోసం వాడుకోవడం మతపరమైన సంస్థల దుర్వినియోగ నిరోధక చట్టం1988 ప్రకారం తీవ్రమైన నేరంగా పరిగణించబడుతుందనీ, ద్వేషపూరిత ప్రసంగాలు చేస్తూ కులమతాల మధ్య చిచ్చు పెట్టేలా ప్రవర్తించే వారికి ఐదేళ్ల వరకు జైలు శిక్ష విధించే అవకాశం ఉందన్నారు.బహిరంగ సభలు, ఊరేగింపుల నిర్వహణలో జిల్లా పోలీస్ చట్టం ప్రకారం ముందస్తు లైసెన్సులు పొందాలని, పోలీసుల సూచనలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ ప్రజా జీవనానికి ఆటంకం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.వీటితో పాటు తెలంగాణ మున్సిపాలిటీల చట్టం2019 ప్రకారం ఎన్నికల విధులకు ఆటంకం కలిగించినా, రిగ్గింగ్ వంటి అక్రమాలకు పాల్పడినా శిక్షార్హులన్నారు. మున్సిపల్ ఎన్నికలు జరుగుతున్న ప్రాంతాల పోలీస్ కమీషనర్లు, ఎస్పీలు , స్టేషన్ హౌస్ ఆఫీసర్లు, శాంతి భద్రతల ఎఐజి రమణ కుమార్, తదితరులు వీడియో కాన్ఫరెన్స్ కు హాజరయ్యారు.

# బంగారం, వెండి ధరలు

## ఎందుకు తగ్గుతున్నాయి? ఎందుకు పెరుగుతున్నాయి..?



బంగారం, వెండి ధరలు రికార్డు స్థాయికి చేరుకున్న తరువాత ఒక్కసారిగా పతనం మొదలైంది. ఆ పతనం ఇంకా కొనసాగుతోంది.ప్రపంచ సంక్షోభం కారణంగా గత సంవత్సరం రికార్డు స్థాయిలను తాకినప్పటికీ, గత మూడు, నాలుగు రోజులుగా బంగారం, వెండి ధరలు గణనీయంగా తగ్గాయి. తత్ఫలితంగా, ఈ తగ్గుదల సమయంలో బంగారం, వెండిని కొనడం మంచిదేనా లేదా ధరలు మరింత తగ్గే వరకు వేచి ఉండటం మంచిదా అని పెట్టుబడిదారులు ఆలోచిస్తున్నారు. నిజానికి, ఈ వారం రికార్డు గరిష్ఠాలను చేరుకున్న తర్వాత బులియన్ మార్కెట్లో గణనీయమైన తగ్గుదల డాలర్ బలోపేతం కావడం, అమెరికా ద్రవ్య విధానంపై పెరుగుతున్న అంచనాల కారణంగా నమ్ముతారు. అంతర్జాతీయంగా ఏర్పడిన అస్థిర పరిస్థితుల మధ్య బంగారంలో పెట్టుబడి పెట్టడం సురక్షితంగా భావించడంతో జనవరిలో పుత్తడి ధరలు కొత్త రికార్డులను తాకాయి.అయితే, యూఎస్ ఫెడరల్ రిజర్వ్ చీఫ్‌గా సెంట్రల్ బ్యాంక్ మాజీ గవర్నర్ కెవిన్ వార్ష్ పేరు ప్రతిపాదించిన తరువాత మార్కెట్లలో లోహాల ధరలు శుక్రవారం పతనం కావడం ప్రారంభమైంది.వార్ష్ పేరును ఫైనాన్షియల్ మార్కెట్లు స్వాగతించాయి. శుక్రవారం అనేక దేశాల కరెన్సీలతో పోల్చినప్పుడు డాలర్ విలువ 1 శాతం పెరిగింది.డాలర్ పుంజుకోవడంతో, 1983 తర్వాత బంగారం ధరల్లో ఒకే రోజు ఈ స్థాయిలో భారీ పతనం నమోదైంది. బంగారం ధర 9 శాతం, వెండి ధర 27శాతం పడిపోయింది. బంగారం, వెండి ధరలు తగ్గడానికి ప్రధాన కారణం ట్రంప్ పరిపాలన అమెరికా ఫెడరల్ రిజర్వ్ అధిపతిగా కెవిన్ వార్ష్‌ను నామినేట్ చేస్తుందనే ఊహాగానాలు పెరుగుతున్నాయి. ఇది వడ్డీ రేటు తగ్గింపు అంచనాలను పెంచింది, ఇది డాలర్, విలువైన లోహాలపై ప్రత్యక్ష ప్రభావాన్ని చూపింది. ఇంకా, భౌగోళిక రాజకీయ అనిశ్చితులు, దీర్ఘకాలిక విధాన సంకేతాలు కూడా మార్కెట్‌ను ప్రభావితం చేశాయి. దేశీయంగా, బడ్జెట్ 2026లో బంగారం, వెండికి సంబంధించి ఎటువంటి ప్రధాన ప్రకటనలు లేవు. దేశీయంగా గట్టి మద్దతు ఇచ్చే ప్రకటలు కూడా లేకపోవడం కూడా మరో కారణం. మార్కెట్లు ఇప్పుడు రాబోయే ఆర్బీఐనిర్ణయాలు, యూఎస్ ఉపాధి డేటా, పిఎంఐ డేటాపై దృష్టి సారించాయి, ఇవి ధరలు స్థిరీకరిస్తాయా లేదా మరింత అస్థిరతను చూస్తాయా అని నిర్ణయిస్తాయి.ప్రస్తుతానికి బంగారం, వెండి ధరల్లో అనిశ్చితి కొనసాగుతుందని నిపుణులు భావిస్తున్నారు. మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ సీనియర్ విశ్లేషకుడు మానవ్ మోడీ ప్రకారం, రాబోయే కాలంలో ఈ లోహాల ధరలు హెచ్చుతగ్గులకు లోనవుతూనే ఉండవచ్చు, కాబట్టి పెట్టుబడిదారులు జాగ్రత్తగా ముందుకు సాగాలి. ఇంతలో, ఆదివారం వరుసగా రెండో రోజు కూడా తగ్గుదల కొనసాగింది, ఫ్యూచర్స్ ట్రేడింగ్‌లో వెండి ధరలు కిలోగ్రాముకు తొమ్మిది శాతం తగ్గి ₹2.65 లక్షలకు చేరుకోగా, బంగారం మూడు శాతం తగ్గి 10 గ్రాములకు ₹1.47 లక్షలకు చేరుకుంది.మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ (MCX)లో మార్చి నెలలో డెలివరీ చేయాల్సిన వెండి ధర లో సర్క్యూట్‌ను తాకింది. JM ఫైనాన్షియల్ సర్వీసెస్ EBGకమోడిటీ & కరెన్సీ రీసెర్చ్ వైస్ ప్రెసిడెంట్ ప్రణవ్ మీర్ ప్రకారం, దేశీయ మార్కెట్లో బంగారం దాని ఆల్‌టైమ్ గరిష్ఠ స్థాయి నుంచి దాదాపు 20 శాతం తగ్గింది, వెండి దాదాపు 37 శాతం తగ్గింది, ఇది ఇటీవలి లాభాల బుకింగ్, ధరలలో ర్యాలీ తర్వాత సహజ క్షీణతను ప్రతిబింబిస్తుంది.విలువైన లోహాలకు 2025 అద్భుతమైన సంవత్సరంగా నిలిచింది. 1979 తర్వాత బంగారం అత్యధిక వార్షిక లాభాల్ని నమోదు చేసింది.ట్రంప్ సుంకాల భయాలు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌కు సంబంధించిన షేర్ల ధరలు పెరగవచ్చనే అంచనాలమధ్య ఫైనాన్షియల్ మార్కెట్లలో ఆందోళన ఏర్పడటంతో బంగారం, వెండి ధరలు కొత్త రికార్డుల్ని తాకాయి.బంగారం ధర ఈ ఏడాది జనవరి చివరి నాటికి 5,500డాలర్లను దాటింది, వెండి ధర కూడా 'ఆల్‌టైమ్ హై'కి చేరింది.2026లో ఫెడరల్ రిజర్వ్ రెండుసార్లు వడ్డీ రేట్లను తగ్గించవచ్చని వాల్‌స్ట్రీట్ వర్గాలు భావిస్తున్నాయి. వడ్డీ రేట్లు తగ్గితే బంగారం ఆకర్షణీయ పెట్టుబడిగా మారుతుంది.బంగారం ధరలు పెరగడానికి మరో పెద్ద కారణం లభ్యత. వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ ట్రేడ్ అసోసియేషన్ ప్రకారం ఇప్పటి వరకు 216,265 టన్నుల బంగారాన్ని మాత్రమే వెలికి తీశారు.కొన్నేళ్ల క్రితం వివిధ దేశాల కేంద్ర బ్యాంకులు బంగారాన్ని కొనుగోలు చేయడం మొదలు పెట్టడంతో బంగారం ధరలు పెరగడం మొదలైంది.అయితే గత ఏడాది కాలంలో అమెరికా సుంకాల వంటి అంతర్జాతీయ పరిణామాలు బంగారాన్ని మరింత ఆకర్షణీయ పెట్టుబడిగా మార్చాయి. ఆర్థికపరమైన ఆందోళనలు కూడా బంగారం విలువ పెరగడానికి కారణమైనప్పటికీ, పరిస్థితులు చక్కబడినప్పుడు లేదా లాభాలు చాలని ఇన్వెస్టర్లు భావించినప్పుడు ధరలు అంతే తేలిగ్గా పడిపోవచ్చు.అంతర్జాతీయ ఇంధన మార్కెట్లలోనూ ఇదే ట్రెండ్ కొనసాగింది. ముడి చమురు ధర 5 శాతానికి పైగా తగ్గింది. ప్రధాన చమురు ఉత్పత్తి సంస్థలు, యథాతథ స్థితిని కొనసాగించాలని నిర్ణయించడం, అమెరికా ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు తగ్గొచ్చన్న సంకేతాలు వంటివి చమురు ధరలు తగ్గడానికి కారణాలుగా భావిస్తున్నారు.దీంతో పాటు అమెరికా డాలర్ విలువ పెరగడం కూడా ముడి చమురు ధరల తగ్గుదలపై ప్రభావం చూపింది.చమురు ధరను డాలర్లలో నిర్ణయిస్తారు. డాలర్ విలువ పెరిగే కొద్దీ అమెరికాయేతర దేశాలకు ముడి చమురు మరింత ఖరీదైనదిగా మారుతుంది.

# ఎట్టకేలకు ట్రేడ్ డీల్

జయభేరి, న్యూఢిల్లీ, మార్చి 3 :

అమెరికాతో కుదిరిన వాణిజ్య ఒప్పందంపై ప్రధాని మోదీ ఎన్డీయే ఎంపీలకు వివరించారు. ఈ ఒప్పందం ద్వైపాక్షిక సంబంధాలకు మైలురాయి అని, సవాళ్లను అధిగమించి సాధించామని మోదీ తెలిపారు. పార్లమెంట్ సమావేశాల్లో చురుగ్గా పాల్గొని, ప్రభుత్వ విజయాలను ప్రజలకు చేరవేయాలని ఎంపీలకు ప్రధాని సూచించారు. అమెరికా సుంకాలు తగ్గిస్తుందని, భారత్ కూడా తమ వస్తువులపై సున్నాకు తగ్గిస్తుందని ఒప్పందానికి అంగీకరించినట్టు అటు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటన చేసిన సంగతి తెలిసిందే..ఎన్డీయే ఎంపీలతో జరిగిన అంతరంగిక సమావేశంలో అమెరికాతో కుదిరిన వాణిజ్య ఒప్పందం, పర్యవసానాల గురించి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మాట్లాడారని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో కూటమి ఎంపీలు చురుకుగా వ్యవహరించాలని, చర్చల్లో పాల్గొని, ప్రభుత్వ విజయాల గురించి ప్రజలకు నేరుగా తెలియజేయాలని ప్రదాని విజ్ఞప్తి చేసినట్టు తెలిసింది. పార్లమెంటరీ భాగస్వామ్యం ప్రాముఖ్యతను నొక్కిచెబుతూ ప్రధాని తన ప్రసంగాన్ని ప్రారంభించారు. ఎన్డీయే ఎంపీలంతా సభలో పూర్తి హాజరును కొనసాగించాలని, కీలక అంశాలపై చర్చలకు సహకరించాలని ఆయన కోరారు.'ఎంపీలు అందరూ సభలో ఉండాలి, చర్చలో పాల్గొనాలి' అని ఆయన అన్నట్టు సమావేశం గురించి తెలిసిన వర్గాలు పేర్కొన్నాయి. 'ప్రజలు విమర్శిస్తున్నప్పటికీ, మేము ధైర్యం కోల్పోలేదు..మా సహనం ఫలించింది. ప్రపంచ క్రమం మారుతోందని నేను అప్పుడే చెప్పాను' అని వ్యాఖ్యానించారు.సోమవారం ప్రదాని నరేంద్ర మోదీ, అమెరికా అధ్యక్షుడి మధ్య జరిగిన టెలిఫోన్ సంభాషణ అనంతరం వాణిజ్య ఒప్పందంపై ప్రకటన వెలువడింది. ఈ ఒప్పందం ప్రకారం, భారతీయ వస్తువులపై ప్రస్తుతం ఉన్న సుంకాలను 25 శాతం నుంచి 18 శాతానికి తగ్గించడానికి అమెరికా అంగీకరించింది. ఇది తక్షణమే అమల్లోకి వస్తుంది.''భారత ప్రధానమంత్రి మోదీతో ఉన్న స్నేహం, గౌరవంతో పాటు ఆయన అభ్యర్థన మేరకు తక్షణమే అమల్లోకి వచ్చేలా అమెరికా, భారతదేశం మధ్య ఒక వాణిజ్య ఒప్పందానికి మేము అంగీకరించాం.. దీని ప్రకారం పరస్పర సుంకాలను 25 శాతం నుంచి 18 శాతానికి అమెరికా తగ్గిస్తుంది' అని ట్రంప్ తన సొంత సామాజిక మాధ్యమం ట్రూత్ సోషల్‌లో తెలిపారు. అంతేకాదు, అమెరికా వస్తువులపై సుంకాలను సున్నాకు తగ్గించడానికి భారత్ కట్టుబడి ఉందని అన్నారు. ఇంధనం, సాంకేతికత, వ్యవసాయం, బొగ్గు, ఇతర రంగాలతో సహా 500 బిలియన్ డాలర్లకు పైగా విలువైన అమెరికా ఉత్పత్తులను భారత్ కొనుగోలు చేస్తుందని ట్రంప్ చెప్పారు. ఇక, ప్రధాని మోదీ సైతం గొప్ప మిత్రుడు ట్రంప్‌తో మాట్లాడటం చాలా సంతోషంగా ఉందని అన్నారు.

దేశాలతో వాణిజ్య చర్చలకు సంబంధించి ప్రభుత్వం స్థిరమైన వైఖరితో ఉంటుందని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. అమెరికాతో చారిత్రాత్మక ట్రేడ్ డీల్ కుదిరిన సందర్భంగా ఎన్డీయే కూటమి సమావేశంలో మోదీ మాట్లాడారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్ పై టారిఫ్ లు విధించడంపై ఎన్నో విమర్శలు ఎదుర్కొన్నట్లు తెలిపారు. సుంకాల విషయంలో తమ ప్రభుత్వాన్ని విమర్శలు చుట్టుముట్టాయని గుర్తుచేసుకున్నారు. ప్రపంచ దేశాల మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తతల వల్ల ఎన్నో దేశాలు వాణిజ్యపరంగా సమస్యలు ఎదుర్కొంటున్నప్పటికీ.. భారత్ మాత్రం ప్రయోజనం పొందుతోందని ప్రధాని మోదీ పేర్కొన్నారు.

భారత్‌అమెరికా మధ్య కుదిరిన వాణిజ్య ఒప్పందంపై ప్రతిపక్షాలు తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పిస్తున్నాయి. దేశ సార్వభౌమాధికారం, ప్రభుత్వ పారదర్శకత, రైతుల ప్రయోజనాలు, ఇంధన భద్రత వంటి అంశాలపై ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. భారత ప్రభుత్వం బదులుగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక ప్రకటనలు చేయడంపై కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీ నేతలు తీవ్ర అభ్యంతరం తెలిపారు. ఈ ఒప్పందం వల్ల అమెరికాకే ఎక్కువ ప్రయోజనం చేకూరుతుందని వారు ఆరోపించారు.ఈ ఒప్పందంపై సంతోషించాల్సింది ఏమీ లేదని కాంగ్రెస్ ఎంపీ సుఖ్‌దేవ్ భగత్ అన్నారు. ఐఏఎన్ఎస్ వార్తాసంస్థతో మాట్లాడుతూ, "గతంలో 34 శాతంగా ఉన్న టారిఫ్‌ను ఇప్పుడు 18 శాతానికి తగ్గించామని సంబరపడటం ఆశ్చర్యంగా ఉంది. మన దేశానికి సంబంధించిన వాణిజ్య ఒప్పందాల గురించి ట్రంప్ చెప్పడమేంటి? మనం ఇంకా సార్వభౌమ దేశం కాదా? ఏ దేశం నుంచి చమురు కొనాలి, ఎవరితో వ్యాపారం చేయాలో అమెరికా నిర్ణయిస్తుందా? ప్రధాని బదులు ట్రంప్ నుంచి ఇలాంటి కీలక సమాచారం రావడం దేశానికి మంచి సంకేతం కాదు" అని ఆయన వ్యాఖ్యానించారు.ప్రధాని మోదీ, అధ్యక్షుడు ట్రంప్ మధ్య ఫోన్ సంభాషణ తర్వాత సోమవారం ఈ ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందం ద్వారా భారత వస్తువులపై అమెరికా సుంకాలను 18 శాతానికి తగ్గించగా, అమెరికా ఉత్పత్తులపై భారత్ కొన్ని వాణిజ్య అడ్డంకులను సడలించింది. ఈ ఒప్పందంతో భారత ఎగుమతులకు ప్రోత్సాహం లభిస్తుందని ప్రభుత్వం చెబుతుండగా, దీనిపై పార్లమెంటులో పూర్తి వివరాలతో కూడిన ప్రకటన చేయాలని విపక్షాలు పట్టుబడుతున్నాయి.

భారత్, అమెరికా మధ్య కుదిరిన కీలక వాణిజ్య ఒప్పందంపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. ఇది ఒక చారిత్రక మైలురాయి అని అభివర్ణిస్తూ, ఈ ఒప్పందాన్ని ఖరారు చేసిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ఆయన అభినందనలు తెలిపారు. ఈ ఒప్పందంలో భాగంగా సుంకాలను 18 శాతానికి తగ్గించడం ఒక దూరదృష్టితో కూడిన చర్య అని చంద్రబాబు కొనియాడారు. ప్రధాని మోదీ నాయకత్వంలో భారత్ ప్రపంచ ఆర్థిక శక్తిగా తన స్థానాన్ని సుస్థిరం చేసుకుంటోందని చంద్రబాబు ప్రశంసించారు. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లోని యువత, రైతులకు కూడా ఇది ఎంతో మేలు చేస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

భారత్, అమెరికా మధ్య కుదిరిన వాణిజ్య ఒప్పందంపై లోక్‌సత్తా పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ జయప్రకాశ్ నారాయణ హర్షం వ్యక్తం చేశారు. ఇది దేశానికి గొప్ప శుభవార్త అని పేర్కొంటూ, ఈ విజయం సాధించినందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి హృదయపూర్వక అభినందనలు తెలిపారు. క్లిష్టమైన అడ్డంకులు ఎదురైనప్పటికీ, ప్రధాని మోదీ ఎంతో సంయమనంతో వ్యవహరించి జాతీయ ప్రయోజనాలను కాపాడారని ఆయన ప్రశంసించారు.ఈ ఒప్పందంపై జేపీ స్పందిస్తూ, "తీవ్రమైన సవాళ్ల నడుమ జాతీయ ప్రయోజనాలను ప్రోత్సహించడం, ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థిక వ్యవస్థతో స్నేహాన్ని కాపాడుకోవడం, అదే సమయంలో జాతీయ గౌరవాన్ని నిలబెట్టడం వంటి అంశాలలో ప్రధాని మోదీ ఒక మాస్టర్ క్లాస్ ప్రదర్శించారు" అని కొనియాడారు.

## నెయ్యి కల్తీపై ఏపీ కేబినెట్ సీరియస్

వివరాలను వెల్లడించారు. ఈ అంశంపై రాజకీయ ప్రయోజనాలు ఆశించడం లేదని, కేవలం భక్తుల మనోభావాలను గౌరవిస్తూ, శ్రీవారి క్షేత్ర పవిత్రతను పునరుద్ధరించడమే తమ లక్ష్యమని మంత్రులు స్పష్టం చేశారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సహా మంత్రులందరూ ఈ అంశంపై తమ అభిప్రాయాలను నిర్మొహమాటంగా వెల్లడించారని తెలిపారు.

**కొలుసు పార్థసారథి ఏమన్నారంటే..**

మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ, "కోట్లాది మంది హిందువులు ఆరాధించే ఏడుకొండలవాని సన్నిధిలో జరిగిన ఈ మహాపాపం గురించి సీబీఐ ఇచ్చిన నివేదికపై కేబినెట్ సుదీర్ఘంగా చర్చించింది. హిందువుల మనోభావాలను, తిరుమల పవిత్రతను కాపాడటానికి ఎలాంటి చర్యలు తీసుకోవాలనే దానిపై మంత్రులందరూ అభిప్రాయాలు తెలిపారు. సీబీఐ ఛార్జ్‌షీట్ దాఖలు చేసినప్పటికీ, కోర్టు ఇంకా కాగ్నిజెన్స్ లోకి తీసుకోలేదు. అయితే, గత ప్రభుత్వ హయాంలో జరిగిన ఈ తప్పిదాలను సరిదిద్దేందుకు, బాధ్యులపై చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది," అని అన్నారు.

**పయ్యావుల కేశవ్ వివరణ..**

ఈ వ్యవహారంలోని సాంకేతిక, చట్టపరమైన అంశాలను ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ వివరించారు. "సీబీఐ నుంచి ప్రభుత్వానికి 11 పేజీల నివేదిక అందింది. ఇందులో గత ప్రభుత్వ హయాంలో జరిగిన ఉద్దేశపూర్వక తప్పిదాలను స్పష్టంగా పేర్కొన్నారు. ఎన్‌డీబీసీఏఎల్ఎఫ్ ఇచ్చిన ల్యాబ్ రిపోర్ట్ ప్రకారం నెయ్యిలో సోయాబీన్, ఫిష్ ఆయిల్, బీఫ్ టాలో (జంతు కొవ్వు), లార్డ్ వంటివి ఉండే అవకాశం ఉందని (సస్పెక్టెడ్ అడల్టరెంట్స్) తేలింది. ఈ నివేదిక ఆధారంగానే ముఖ్యమంత్రి చంద్రబాబు ఆనాడు ఆరోపణలు చేశారు" అని కేశవ్ తెలిపారు.

"2022లోనే సీఎఫ్‌టీఆర్ఐ రిపోర్టులో కల్తీ జరిగిందని తేలినా, నాటి టీటీడీ అధికారులు, పాలకమండలి ఛైర్మన్ దానిని తొక్కిపెట్టారు. గతంలో చంద్రబాబు హయాంలో నెయ్యి కొనుగోలుకు కఠిన నిబంధనలు పెట్టారు. కానీ, వైసీపీ ప్రభుత్వం వచ్చాక కేవలం ఐదు నెలల్లోనే ఆ నిబంధనలను ఉద్దేశపూర్వకంగా సడలించారు. పాలు సేకరించే సామర్థ్యం లేని సంస్థలకు, టర్నోవర్ తగ్గించి, అనుభవం లేని సంస్థలకు టెండర్లు కట్టబెట్టారు. బోలే బాబా వంటి సంస్థలకు టెండర్ దక్కించుకోవడానికి వైవీ సుబ్బారెడ్డి పీఏ ప్రయత్నించినట్లు కూడా ఆరోపణలున్నాయి. ఫేక్ డాక్యుమెంట్లతో టెండర్లలో పాల్గొన్నా అధికారులు అడ్డుకోలేదు. ఈ తప్పులన్నింటికీ నాటి ఈవో అనిల్ కుమార్ సింఘాల్, ఏఈవో ధర్మారెడ్డి, సీఏవో బాలాజీ బాధ్యులని సీబీఐ నివేదికలో పేర్కొంది. వారిపై చర్యలు తీసుకోవాలని సిఫార్సు చేసింది," అని పయ్యావుల కేశవ్ వివరించారు.

మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ, ఈ అంశంలో పూర్తి పారదర్శకంగా వ్యవహరిస్తామని చెప్పారు. "కేబినెట్ సమావేశానికి అడ్వకేట్ జనరల్‌ను కూడా ఆహ్వానించి న్యాయపరమైన సలహాలు తీసుకున్నాం. భక్తుల మనోభావాలతో ఆడుకున్న వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదు. 2022లో కల్తీ రిపోర్ట్ వచ్చాక, గత ప్రభుత్వం ఒక్కసారి కూడా నెయ్యి శాంపిల్స్‌ను టెస్టుకు పంపలేదు. ఎందుకంటే అందులో అసలు నెయ్యే లేదు. కానీ, మా కూటమి ప్రభుత్వం వచ్చాక 12 నుంచి 15 సార్లు నాణ్యతా పరీక్షలు చేయించాం. దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నదే మా ప్రభుత్వ ఉద్దేశం" అని స్పష్టం చేశారు.

సత్యకుమార్ యాదవ్ ఆరోపణలు..

మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ, వైసీపీ నాయకత్వం హిందూ ధర్మం మూలాలనే దెబ్బతీసే ప్రయత్నం చేసిందని ఆరోపించారు. "కల్తీ జరిగిందని వైసీపీ నేతలే ఒప్పుకుంటున్నారు. అంటే, శ్రీవారి ప్రసాదంలో కల్తీని సమర్థిస్తున్నారా? అసలు పాలు లేకుండా నెయ్యి ఎలా తయారు చేస్తారు? రూ.250 కోట్ల అవినీతి కోసం కోట్లాది మంది భక్తుల విశ్వాసాలను దెబ్బతీశారు. గతంలో తిరుమలలో ఏడు కొండలకు బదులు రెండే ఉన్నారని వాదించడం, అన్యమత ప్రచారాన్ని ప్రోత్సహించడం, డిక్లరేషన్ ఇవ్వకుండా దర్శనాలు చేయడం వంటి చర్యలతో ఆలయ పవిత్రతను మంటగలిపారు. ఈ బోలే బాబా డైరీని దొడ్డిదారిన తెచ్చిన అలీబాబా ఎవరో, దాని వెనకున్న 40 దొంగలు ఎవరో ప్రజలకు తెలియాలి," అని సత్యకుమార్ యాదవ్ ఘాటుగా విమర్శించారు.

# యాదగిరిగుట్టలో కాంగ్రెస్ కు తొలి విజయం

- పదవ వార్డులో ఏకగ్రీవంగా ఎన్నికైన గుండ్లపల్లి వాణి-భరత్ గౌడ్
- అన్ని వార్డులను సమగ్రంగా అభివృద్ధి చేస్తా
- మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి గుండ్లపల్లి వాణి-భరత్ గౌడ్
- గుండ్లపల్లి వాణి-భరత్ గౌడ్ దంపతులను సన్మానించిన ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య



**జయభేరి, యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 03 :**

అన్ని రాజకీయ పార్టీలు ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న యాదగిరిగుట్ట మున్సిపాలిటీలో అధికార కాంగ్రెస్ పార్టీకి తొలి విజయం లభించింది. పదవ వార్డు కాంగ్రెస్ పార్టీ చైర్మన్ అభ్యర్థి గుండ్లపల్లి వాణిభరత్ గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పదవ వార్డులో గుండ్లపల్లి వాణిభరత్ గౌడ్ నువ్వా నేనా అన్నట్టుగా భావిస్తున్న బీఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థి ఆవుల మమతా సాయి తన నామినేషన్ ఉపసంహ రించుకోవడంతో కాంగ్రెస్ కు ఈ విజయం సమకూరింది. కాంగ్రెస్ కు తొలి విజయం సమకూర్చి యాదాద్రి భువనగిరి జిల్లాలోని ఆరు మున్సిపాలిటీలలో ప్రధానంగా ఆలేరు నియోజకవర్గంలోని యాదగిరిగుట్ట,ఆలేరు మున్సిపాలిటీలలో కాంగ్రెస్ శ్రేణులకు ఈ విజయం జోష్ నింపింది.

**గుండ్లపల్లి వాణి -భరత్ గౌడ్ కు ఆలేరు ఎమ్మెల్యే సన్మానం**

పదవ వార్డులో ఏకగ్రీవంగా ఎన్నికైన మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి గుండ్లపల్లి వాణిభరత్ గౌడ్ దంపతుల కు ప్రభుత్వ విప్,ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య శాలువా కప్పి సన్మానించారు. ఐదేళ్లు గొప్పగా పరిపాలించి కాంగ్రెస్ పార్టీకి మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని ఆలేరు ఎమ్మెల్యే ఈసందర్భంగా ప్రశంసించారు.

**అభివృద్ధిలో అగ్రగామిగా నిలుపుతా : గుండ్లపల్లి వాణి- భరత్ గౌడ్**

యాదగిరిగుట్ట మున్సిపాలిటీలోని 12 వార్డులలో ప్రణాళిక బద్ధంగా అభివృద్ధి కార్యక్రమాలు,ప్రజా సంక్షేమ కార్యక్రమాలు అమలు పరుస్తానని,ఉత్తమ పాలన అందించి కాంగ్రెస్ మంచి పేరు ప్రతిష్టలు తీసుకు వస్తానని ఈ సందర్భంగా గుండ్లపల్లి వాణి భరత్ గౌడ్ ఆలేరు ఎమ్మెల్యేకు హామీ ఇచ్చారు.

12 వార్డులలో కాంగ్రెస్ జెండా ఖాయం

కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజాపాలన పట్ల ప్రజలు సంతోషంతో ఉన్నారని, మిగతా 11 వార్డులలోనూ కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థులను గెలిపించుకుంటామని ఈ సందర్భంగా గుండ్లపల్లి వాణిభరత్ గౌడ్ అన్నారు. ఈ సన్మాన కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు జనగాం ఉపేందర్ రెడ్డి,చీర శ్రీశైలం,జీవన్ రెడ్డి,పెలిమెల్లి శ్రీధర్ గౌడ్,అరుణ్,వంశీ తదితరులు పాల్గొన్నారు.

# భగ్గుమన్న బీఆర్ఎస్

- నామినేషన్ ఉపసంహరించుకున్న
- పదవ వార్డు బిఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థి ఆవుల మమతా-సాయి
- ఎమ్మెల్యే ప్రలోభాలు, బెదిరింపులపై ఈసీకి ఫిర్యాదు చేస్తామన్న గొంగిడి మహేందర్ రెడ్డి
- యాదగిరిగుట్ట పట్టణంలో బిఆర్ఎస్ పార్టీ నిరసన ర్యాలీ
- ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య దిష్టిబొమ్మ దహనానికి యత్నం అడ్డుకున్న పోలీసులు



**జయభేరి, యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 03 :**

యాదగిరిగుట్ట మున్సిపాలిటీ ఎన్నికలలో భాగంగా కౌన్సిలర్ అభ్యర్థుల నామినేషన్ల ఉపసంహరణ ముగింపు వేళ మంగళవారం యాదగిరిగుట్ట పట్టణంలో ఒక్కసారిగా రాజకీయ ఉద్రికత్తలు చోటుచేసుకున్నాయి. కాంగ్రెస్, బిఆర్ఎస్, బిజెపి, సిపిల పార్టీలు ప్రతిష్టాత్మకంగా తలపడుతున్నాయి. కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి గుండ్లపల్లి వాణి భరత్ గౌడ్ కౌన్సిలర్ గా పోటీ చేస్తున్న పదవ వార్డులో బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి ఆవుల సమ సాయి తన నామినేషన్ అనూహ్యంగా ఉపసంహరించుకున్నారు. దీంతోగుండ్లపల్లి వాణి భరత్ గౌడ్ ఏకగ్రీవంగా మారింది. బిఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థులను ప్రలోభాలకు బెదరింపులకు గురిరేస్తున్నారు. ఈ మేరకు ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తామని బిఆర్ఎస్ పార్టీ నేత, మాజీ డిసిసిబీ చైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డి విలేకరుల సమావేశంలో ప్రకటించారు. పదవ వార్డులో బిఆర్ఎస్ పార్టీ గెలుస్తుందన్న నమ్మకంతో ఉండగా..ఈ పరిణామం ఊహించలేనిదని అన్నారు. ఆలేరు, యాదగిరిగుట్ట మున్సిపాలిటీలలో ఎన్నికలు ప్రజాస్వామ్య బద్ధంగా జరిగేందుకు ఎన్నికల సంఘంతో పాటు పోలీసులు సహకరించాలని ఆయన కోరారు. ర్యాలీ, దిష్టిబొమ్మ దహనానికి యత్నం ఎమ్మెల్యే డౌన్ డౌన్ అంటూ... గొంగిడి మహేందర్ హేందర్ రెడ్డి, కర్రె వెంకటయ్య అధ్వర్యంలో యాదగిరిగుట్ట పట్టణంలోని బిఆర్ఎస్ శ్రేణులు భారీ ర్యాలీ నిర్వహించారు. పాతగుట్ట చౌరస్తా వద్ద ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య దిష్టి బొమ్మ దహనానికి ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు.



**కాంగ్రెస్ ను ఓడించాలని గొంగిడి మహేందర్ రెడ్డి పిలుపు**

ఎన్నికల అక్రమాలకు పాల్పడుతున్న కాంగ్రెస్ విధానాలను ఇంటింటికి ప్రచారం చేస్తామని, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను ఓడించాలని గొంగిడి మహేందర్ రెడ్డి ఈ సందర్భంగా ప్రజలకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేశారు.




## పులి దాడుల కట్టడికి తక్షణమే చర్యలు తీసుకోవాలి

- పులి సంచారం పై యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్‌తో మాట్లాడిన ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

**జయభేరి, యాదగిరిగుట్ట, పిభ్రవరి 03:**

పెద్ద పులి దాడులు ప్రజలు భయాందోళనకు గురవుతున్నారని,పులి దాడులను కట్టడి చేసేందుకే తక్షణమే అవసరమైన చర్యలు తీసుకోవాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావును ప్రభుత్వ విప్,ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య కోరారు. మంగళవారం యాదగిరిగుట్ట, రాజాపేట,తుర్కపల్లితో పాటు పలు మండలాలలో పులి సంచారం,లేగ దూడలపై పెద్ద పులి దాడులను జిల్లా కలెక్టర్ దృష్టికి బీర్ల అయిలయ్య తీసుకెళ్లారు. పులి సంచారంతో ప్రజల్లో భయాందోళనలు నెలకొన్నాయని,వెంటనే అటవీ శాఖ అధికారులతో రివ్యూ సమావేశం ఏర్పాటు చేయాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్‌ను కోరారు. పులి దాడులను కట్టడి చేసేందుకు తక్షణమే అవసరమైన చర్యలు చేపట్టాలని,ఇందుకోసం ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలని సూచించారు. ఈ ప్రాంత రైతులు,ప్రజలు, పశువుల రక్షణకు ప్రభుత్వం పూర్తి బాధ్యత తీసుకోవాలని, ఎలాంటి నష్టం జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజలు ఆందోళన చెందకుండా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని ఆయన కోరారు.

## మృతుడి కుటుంబ సభ్యులకు పరామర్శ



**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ కేంద్రానికి చెందిన మృతుడు గొల్ల దశరథ కుటుంబ సభ్యులను మంగళవారం ఆయా పార్టీలకు చెందిన నాయకులు పరామర్శించారు. స్థానిక పోస్ట్ ఆఫీస్ సమీపంలో కిరాణం షాపు నిర్వహించే గొల్ల నర్సింహులు తండ్రి గొల్ల దశరథ అనారోగ్యం కారణంగా మృతి చెందారు. మృతుడు గొల్ల దశరథకు నాటు వైద్యుడిగా మంచి పేరు ఉంది.దీంతో ఈ విషయం తెలుసుకున్న నాయకులు మృతుడి ఇంటి వద్దకు వచ్చి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతుడి పార్టీవ దేహం పై పూలమాలలు వేసి నివాళులర్పించారు.

# లిక్కర్, రియల్ఎస్టేట్ మాఫియాల చేతిలో పరకాలా?

- ఎర్రబెల్లి ప్రదీప్ రావు, మున్సిపల్ ఎన్నికల ఇంచార్జి
- డబ్బు సంచులతో కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రచారం
- బిజెపితోనే పరకాల అభివృద్ధి సాధ్యం



**జయభేరి, పరకాల, ఫిబ్రవరి 03:**

పరకాల పట్టణంలో మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలపై బీజేపీ తీవ్ర విమర్శలు చేసింది. మంగళవారం పరకాల బీజేపీ కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు గాజుల నిరంజన్ ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మున్సిపల్ ఎన్నికల ఇంచార్జ్ ఎర్రబెల్లి ప్రదీప్ రావు, జిల్లా అధ్యక్షుడు కొలను సంతోష్ రెడ్డి, కాంటెస్టెంట్ ఎమ్మెల్యే డాక్టర్ కాళీ ప్రసాద్ రావు, ఎన్నికల కన్వీనర్ డాక్టర్ సిరంగి సంతోష్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రదీప్ రావు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పుడు బీఆర్ఎస్ ప్రభుత్వం కుటుంబ అభివృద్ధికే పరిమితమై రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిందని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ ఆస్తులను అమ్ముకుంటూ అభివృద్ధిని మరిచిపోయిందని, పరకాలలో కాంగ్రెస్ గెలిస్తే అభివృద్ధి శూన్యమవుతుందని అన్నారు. పరకాల అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమని, బీజేపీ చైర్మన్‌ను గెలిపిస్తే అభివృద్ధిని చూపిస్తామని పేర్కొన్నారు.

జిల్లా అధ్యక్షుడు కొలను సంతోష్ రెడ్డి మాట్లాడుతూ.. పరకాల అభివృద్ధి కోసమే బీజేపీ ప్రజల ముందుకు వస్తోందని, ప్రజలందరూ బీజేపీ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. డాక్టర్ కాళీ ప్రసాద్ రావు మాట్లాడుతూ.. కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులు డబ్బు సంచులతో తిరుగుతున్నారని విమర్శించారు. ఒకరు లిక్కర్ మాఫియా, మరొకరు రియల్ఎస్టేట్ మాఫియాగా పరకాలను మాఫియాల కేంద్రంగా మార్చేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఈ రెండు మాఫియాలను తరిమి కొట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. డాక్టర్ సిరంగి సంతోష్ కుమార్ మాట్లాడుతూ.. పరకాలలో బీజేపీ పటిష్టంగా ఉందని, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి కార్యకర్త ఇంటింటా ప్రజలకు వివరించాలని పిలుపునిచ్చారు. మున్సిపాలిటీలో కాషాయ జెండా ఎగరవేయడానికి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాచం గురు ప్రసాద్ జయంత్ లాల్, మేఘనాథ్, సంద్ర మధు, కూతురు రాజు, బైరి శ్రవణ్, శ్రీకాంత్, రత్నలక్ష్మి, ఎర్ర రామన్న, పరకాల ప్రధాన కార్యదర్శి సంగా పురుషోత్తం, నాయకులు మార్త రాజభద్రయ్య ,కొలనుపాక భద్రయ్య, బెజ్జంకి పూర్ణచారి, దగ్గు విజేందర్ రావు, బాసాని సోమరాజు ,కుక్కల విజయ్ కుమార్, నారాయణదాసు,భాస్కరాచారి, పాలకుర్తి తిరుపతి, ముత్యాల దేవేందర్, ఆకుల శ్రీధర్, బండారి గిరి ప్రసాద్, మెంతుల సురేష్, పిట్ట కిషోర్, పైండ్ల రంజిత్, సాదా మధుకర్, కృపాకర్ రెడ్డి, దుబాసి కృష్ణ ప్రసాద్, ఉడుత చిరంజీవి ,సదా రాణి, పుల్ల రాజు, దర్మల దేవేందర్, పల్లె బోయిన భద్రయ్య, బీరం రాజిరెడ్డి బిజెపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## బీజేపి అభ్యర్థి దుబాసి లావణ్యకి ఉత్సాహభరిత స్పందన

**జయభేరి, పరకాల, ఫిబ్రవరి 03:**

పరకాల పట్టణంలోని 17వ వార్డులో బీ జే పి అభ్యర్థి దుబాసి లావణ్య కృష్ణ ప్రసాద్ ప్రచారం జోరుగా కొనసాగుతోంది. మంగళవారం వార్డు లోని వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన ఇంటింటి ప్రచారంలో పార్టీ జిల్లా అధ్యక్షులు, కాంటెస్టెడ్ ఎమ్మెల్యే కాళీ ప్రసాద్, డా సంతోష్ పట్టణ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆమె ఓటర్లను కలిశారు.ఈ సందర్భంగా తమకు అవకాశం ఇస్తే వార్డు అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రచారం సాగుతున్నంతసేపు బీ జే పి పార్టీ మనది. బీ జపి కే ఓటు అంటూ ఓటర్లు ఉత్సాహంగా స్పందించడం విశేషం. అలాగే లో పర్యటించిన సమయంలో మీ బిడ్డా నన్ను ఆశీర్వదించాలని బొట్టు పెడుతూ ఓటు అడుగుతున్న తీరుకు ప్రచారానికి మరింత ఉత్సాహం వచ్చింది. మొత్తం మీద 17వ వార్డులో బీ జే పి జెండా ఎగురుతూ, పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహాన్ని నింపుతోంది. ఈ ప్రచారంలో పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కాలుష్యం నుండి లంకెలపాలెం ప్రాంతాన్ని కాపాడండి



**జయభేరి, పరవాడ:**

పరవాడ మండలం లంకెలపాలెం ప్రాంతాన్ని బొగ్గు, ధూలు కాలుష్యం నుండి కాపాడాలని డిమాండ్ చేస్తూ సోమవారం జిల్లా కలెక్టర్ కు గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మంగళవారం లంకెలపాలెం లో పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఏఈ విక్రమ్ పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన కి గ్రామస్తులు హిందూజా బొగ్గు లారీలు, ఎన్ టి పి సి లారీలు వలన కల్గుతున్న దుమ్ము ధూళి సమస్యలు గురించి వివరించి వాటికీ వెంటనే పరిష్కరం చూపాలని , బొగ్గు ధూలు లారీలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి కాలుష్య సమస్యను పరిష్కరించడానికి చర్యలు చేపడుతున్నట్లు మానిటరింగ్ టీంలు ఏర్పాటు చేస్తున్నట్లు ఏ ఈ తెలిపారు. లంకెలపాలెం గ్రామ నాయకులు కోటేశ్వర రావు, శ్రీనివాసరావు, గంగరాజు, రమేష్, గోవిందా, మూర్తి, సిఐటియు నాయకులు గని శెట్టి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


## ఎన్టిపిసి సి ఎస్ ఆర్ నిధులతో 11 సోలార్ లైట్లు మంజూరు



**జయభేరి, పరవాడ:**

అనకాపల్లి జిల్లా, పరవాడ మండలంలోని వెన్నెలపాలెం గ్రామానికి ఎన్టిపిసి సి ఎస్ ఆర్ నిధుల ద్వారా 11 సోలార్ లైట్లు మంజూరు అవ్వడంతో గ్రామ సర్పంచ్ వెన్నెల అప్పారావు సోలార్ లైట్లకు సంబంధించిన ఎర్త్ వర్క్, లైటింగ్ పనులను అధికారికంగా ప్రారంభించారు. గ్రామ ప్రజలకు ఉపయోగపడేలా వివిధ ప్రాంతాల్లో ఈ సోలార్ లైట్లను ఏర్పాటు చేయనున్నారు. అందులో భాగంగా స్మశాన వాటికలో 3 సోలార్ లైట్లు, శివాలయం సమీపంలో 2 లైట్లు,బీసీ కాలనీలో 3 లైట్లు, కఠారి కళ్లలో 2 లైట్లు,దుర్గ మాంబ ఆలయం వద్ద 1 సోలార్ లైట్ ఏర్పాటు చేయనున్నారు. గ్రామ అభివృద్ధికి తోడ్పడేలా సోలార్ లైట్లను మంజూరు చేసినందుకు ఎన్టిపిసి యాజమాన్యానికి వెన్నెలపాలెం గ్రామ సర్పంచ్ వెన్నెల అప్పారావు, గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సోలార్ లైట్లతో రాత్రివేళ గ్రామంలో భద్రతతో పాటు సౌకర్యం మరింత మెరుగవుతుందని గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## నివాళర్పించిన చల్లా ధర్మారెడ్డి



**జయభేరి, పరకాల, ఫిబ్రవరి 03:**

పరకాల సీనియర్ జర్నలిస్ట్ గోగుల నాగరాజు తండ్రి గోగుల జగదీశ్వర్ ఇటీవలే మృతిచెందగా వారి స్వగ్రామమైన మొగుళ్ళపల్లిలో ఉన్న వారి నివాసానికి వెళ్లి కుటుంబసభ్యులను పరామర్శించిన పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి.ఈ సందర్భంగా జగదీశ్వర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపాలిటీ కాంగ్రెస్ అభ్యర్థుల జాబితా విడుదల

- 28 వార్డుల వారీగా అధికార పార్టీ కాంగ్రెస్ జాబితా..
- బిఫాంలు అందించిన షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి

**జయభేరి, షాద్ నగర్, ఫిబ్రవరి 03 :**

పురపోరుకు సిద్ధమైన కాంగ్రెస్ పార్టీ. రంగా రెడ్డి జిల్లా షాద్ నగర్ లో మున్సిపల్ ఎనిక్కల హడావిడి మొదలైంది. గెలుపే లక్ష్యంగా పార్టీ అన్ని విధాలుగా అభ్యర్థులను పరిశీలించి మంగళవారం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు ఎమ్మెల్యే శంకర్, మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డి చేదుల మీదగా బీఫాంలు అందజేశారు.





**కాంగ్రెస్ బీఫాంలో జాబితా...**

1. మహమ్మద్ ఇర్ఫాన్ ఖాన్, 2. బచ్చలి నరేష్, 3. ఆలోనిపల్లి రాజు గౌడ్, 4. చేగూరు పుష్పమ్మ, 5. సింగపాగ శిరీష, 6. రాజు నాయక్, 7. కొప్పునూరి ప్రవీణ్, 8. జయ ప్రకాష్ గౌడ్, 9. గోద మాధవులు, 10. నడికుడ శ్రావణి, 11. గుడిపల్లి వినోద బీరప్ప, 12. కలంకార్ దిలీప్, 13. రిజ్వాన్ బేగం, 14. అందే మోహన్, 15. మరియా బేగం సాదిక్, 16. వన్నాడ లావణ్య, 17. నాజియా బేగం సర్వర్ పాషా, 18. జమాల్పూర్ సంతోషి బాయి, 19. ఆఫ్రీన్ బేగం షర్ఫుద్దీన్, 20. డాకన్నగారి మనీష్, 21 నాగమణి, 22. దిద్యాల శోభా, 23. అగ్గునూరు బస్వం, 24. అగ్గునూరు విశాల విశ్వం, 25. పెంటయ్య, 26. జామ మంజుల, 27. మురళీమోహన్ (అప్పి), 28. కాటం భాగ్యలక్ష్మి గౌడ్.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్, మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ.... పురపారులో కాంగ్రెస్ ఘన విజయం సాధించాలని ప్రజల సంక్షేమం కోసం కాంగ్రెస్ పార్టీ అన్ని విధాలుగా సంక్షేమ ఫలాలు అందిస్తుంది ప్రజలు ఆలోచించి అత్యధిక సంఖ్యలో కాంగ్రెస్ విజయానికి కృషి చేయాలని అన్నారు. బీఫాంలో తీసుకున్న అభ్యర్థులు ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకొని ప్రజల అభివృద్ధి కోసం కృషి చేసే దిశగా అడుగులు వేయాలని సూచించారు.



## బాలల సంరక్షణ కమిటీలను బలోపేతం చేయాలి

- కాసారపు శ్వేతా శ్రీనివాస్

**జయభేరి, చింతపల్లి, ఫిబ్రవరి 03:**

గ్రామ స్థాయిలో ఏర్పాటు చేసిన బాలల సంరక్షణ కమిటీలను మరింత బలోపేతం చేయాలని చింతపల్లి సర్పంచ్ కాసారపు శ్వేతా శ్రీనివాస్ అన్నారు. సమగ్ర బాలల పరిరక్షణ పథకం (ఐసిపిఎస్) ఆధ్వర్యంలో మంగళవారం బీసీ కాలనీలోని అంగన్వాడీ కేంద్రంలో గ్రామ స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో విధిగా బాలల సంరక్షణ కమిటీలను ఏర్పాటు చేసి, ఎప్పటికప్పుడు బాలల హక్కుల సంరక్షణపై అవగాహన కల్పించాలన్నారు. గ్రామాల్లో బాలలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి సంబంధిత శాఖల అధికారుల దృష్టికి తీసుకువచ్చి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## సమ్మెను జయప్రదం చేయండి

- కార్మికుల రక్తం పీల్చేందుకే లేబర్ కోడ్లు
- సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎన్ రాజు



**జయభేరి, షాద్ నగర్, ఫిబ్రవరి 03 :**

మోడీ ప్రభుత్వం కార్మిక ద్రోహం చేస్తోంది శ్రమ దోపిడీకి చట్టబద్ధత కల్పించేందుకే మోడీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం లేబర్ కోడ్లను తీసుకొచ్చిందని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎన్ రాజు తీవ్రస్థాయిలో విమర్శించారు. కార్మికుల ఉద్యోగ భద్రతను హరించి, యజమానుల ఇష్టారాజ్యానికి తలుపులు తెరవడమే లేబర్ కోడ్ల అసలు ఉద్దేశమని ఆయన స్పష్టం చేశారు. ఫరూక్ నగర్ మండలం చించోడు గ్రామ ప్రాథమిక హెల్త్ సెంటర్ వైద్యాధికారి స్రవంతికి సమ్మెకు సంబంధించిన నోటీసును అందించారు. ఈనెల 12వ తేదీన సిఐటియు వ్యవసాయ కార్మిక సంఘం రైతు సంఘం ఆధ్వర్యంలో లేబర్ కోడ్ల రద్దు కోసం సమ్మె నిర్వహించడం జరుగుతుందని అన్నారు. సమ్మె జయప్రదం చేయాలని ఈ కార్యక్రమానికి ఆశ వర్కర్లు సంసిద్ధం కావాలని రాజు పేర్కొన్నారు.

## బీజేపి కౌన్సిలర్ అభ్యర్థుల బీ ఫార్మ్స్ అందించిన ఎర్రబెల్లి



**జయభేరి, పరకాల, ఫిబ్రవరి 03:**

పరకాల నియోజకవర్గం మునిసిపల్ ఎన్నికల నేపథ్యంలో మంగళవారం పరకాల మున్సిపల్ కార్యాలయంలో భారతీయ జనతా పార్టీ వార్డ్ కౌన్సిలర్ అభ్యర్థుల బిఫార్మ్స్ రిటర్నింగ్ ఆఫీసర్లకు అందజేసిన మునిసిపల్ ఎన్నికల ఇన్చార్జి బిజెపి రాష్ట్ర నాయకులు ఎర్రబెల్లి ప్రదీప్ రావు, జిల్లా అధ్యక్షులు కొలను సంతోష్ రెడ్డి, బిజెపి రాష్ట్ర నాయకులు పరకాల నియోజకవర్గం కంటెస్టెడ్ ఎమ్మెల్యే డా. పగడాల కాళీ ప్రసాద్ రావు, ఎన్నికల కన్వీనర్ డాక్టర్ సిరింగి సంతోష్ కుమార్.

## సూపరిండెంట్ గా శ్రవణ్ కుమార్ బాధ్యతలు స్వీకరణ




**జయభేరి, తుర్కపల్లి, ఫిబ్రవరి 03 :**

తుర్కపల్లి మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ సూపరిండెంట్ గా ఎం శ్రవణ్ కుమార్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. మండల కేంద్రంలో గతంలో విధులు నిర్వహించిన సూపరిండెంట్ జే వినోద్ రెడ్డి ఇటీవల మరణించడంతో ఆస్థానం కాళీ కావడంతో భువనగిరి కలెక్టర్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న శ్రవణ్ కుమార్ సూపరిండెంట్ గా పదవి బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో లెంకల గీతారెడ్డి, సీనియర్ అసిస్టెంట్ ప్రవీణ్ కుమార్, జూనియర్ అసిస్టెంట్లు జహంగీర్, సంతోష్ కుమార్ పాల్గొన్నారు.



## ఉర్సు వేడుకలను జయప్రదం చేద్దాం

- ఉర్సు నిర్వాహకులు షరీఫ్

**జయభేరి, దేవరకద్ర :**

దేవరకద్ర లోని స్థానిక మైనార్టీ వాడలో కొలువుదీరిన హజ్రత్ ఖాజా సయ్యద్ షా రహమాన్ ధూలే హజరత్ ఖాజా సయ్యద్ షా అబ్దుల్ ఖదీర్ ఉర్సు వేడుకలను జయప్రదం చేద్దామని ఉర్సు నిర్వహకులు షరీఫ్ కోరారు. ఈనెల 6 నుండి ఉర్సు వేడుకలు ప్రారంభం అవుతాయన్నారు. ఈ సందర్భంగా ఉర్సు మొదటి రోజు గందోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. అలాగే ఈనెల 7న జియారథ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉర్సు సందర్భంగా దర్గా వద్ద అద్భుతమైన ఖవాలి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. కావున ఈ పవిత్ర ఉర్సు కార్యక్రమానికి భక్తులు, గ్రామస్తులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని షరీఫ్ కోరారు.

## పడి పూజకు హాజరైన సరోజ్ రెడ్డి



**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం మున్సిపాలిటీ పరిధిలో 5వ వార్డుకు చెందిన జగన్ రాజ్ మంగళవారం నిర్వహించిన శివ స్వాముల పడి పూజకు హైకోర్టు న్యాయవాది, దేవరకద్ర నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు మందడి సరోజ్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా అక్కడ జరిగిన పూజా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. సరోజ్ రెడ్డి ని పూజా నిర్వాహకులు ఘనంగా సన్మానించి స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో శివ స్వాములు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## బీ ఫామ్ ఇవ్వలేదని మహిళ నిరసన

**జయభేరి, సంగారెడ్డి :**

జిన్నారం ఎంపిడివో కార్యాలయం ఎదుట మహిళ కౌన్సిలర్ అభ్యర్థి నిరసన కు దిగింది. కాంగ్రెస్ పార్టీ బీ ఫామ్ ఇవ్వకుండా మోసం చేసిందని నీలం శ్రీలత నిరసనకు దిగింది. చివరి నిమిషంలో 4వ వార్డు బీ ఫామ్ వేరే అభ్యర్థికి అమ్ముకున్నారని ఆరోపించింది. రోడ్డుపై కూర్చొని మహిళ అభ్యర్థి తెలిపింది.

# మున్సిపల్ ఎన్నికల్లో బీసీలకు పెద్దపీట

- విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్ రెడ్డి

**జయభేరి, మేడ్చల్ :**



మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బీసీలకు పెద్ద పీట వేసిందని మేడ్చల్ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్ రెడ్డి తెలిపారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ అభ్యర్థులకు బీ ఫారం అందించిన సందర్భంగా పార్టీ జిల్లా కార్యాలయంలో సుధీర్ రెడ్డి విలేఖరులతో మాట్లాడారు. మేడ్చల్ జిల్లాలో జరుగుతున్న మున్సిపల్ ఎన్నికల్లో కులాల ప్రాతిపదికన కాంగ్రెస్ పార్టీ బీసీలకు 50 శాతం సీట్లు కేటాయించి బీ ఫారం ఇవ్వడం జరిగిందన్నారు. మేడ్చల్ నియోజకవర్గంలోని మూడు చింతలపల్లి, అలియబాద్, ఎల్లంపేట్ మున్సిపాలిటీలను కాంగ్రెస్ పార్టీ చైర్మన్ పీఠాలను హస్తగతం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపు కోసం కలిసి కట్టుగా పనిచేయాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఆరు గ్యారెంటీలలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల విద్యుత్, గ్యాస్ సబ్సిడీ, ఆరోగ్య శ్రీ పథకాలను అమలు చేస్తున్నామని సుధీర్ రెడ్డి తెలిపారు. పేద ప్రజలకు సన్నబియ్యం, రైతులకు రుణమాఫీ, రైతుబంధు, ఇందిరమ్మ ఇల్లు కేటాయిస్తున్నాం అన్నారు. స్థానిక ఎమ్మెల్యే మల్లారెడ్డికి వ్యాపారం తప్ప ప్రజాసేవ చేతకాదన్నారు. గతంలో మంత్రిగా మల్లారెడ్డి ప్రజలకు చేసిందేమీ లేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఉద్దండపురం సత్యనారాయణ, శ్రీనివాస్ రెడ్డి, గౌడవెల్లి బల్ రెడ్డి, శంకర్ ముదిరాజ్, సురేందర్ ముదిరాజ్, రవి ముదిరాజ్, సంతోష్ గౌడ్, మహేష్ కురుమ, నవీన్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# నక్క ప్రభాకర్ గౌడ్ జన్మదిన వేడుకలు

- రక్తదాన శిబిరం నిర్వహించిన పలువురు నాయకులు, కార్యకర్తలు
- ప్రజా సేవకే పునరంకితం అవుతానన్న ప్రభాకర్ గౌడ్

**జయభేరి, శామీర్ పేట్, జయభేరి 3:**



కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకుడు, ఉమ్మడి శామీర్ పేట్ మండల మాజీ జెడ్పీటీసీ నక్క ప్రభాకర్ గౌడ్ జన్మదిన వేడుకలు శామీర్ పేట్ మండల కేంద్రంలో మంగళవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా నక్క ప్రభాకర్ గౌడ్ పుట్టినరోజును పురస్కరించుకుని నాయకులు , కార్యకర్తలు రక్తదాన శిబిరం నిర్వహించారు. అదేవిధంగా మేడ్చల్, మల్కాజ్ గిరి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గాల నుండి కాంగ్రెస్ పార్టీ నాయకులు, అభిమానులు భారీ సంఖ్యలో తరలివచ్చి నక్క ప్రభాకర్ గౌడ్ కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. ఇక మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్, మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్ రెడ్డి, టీపీసీసీ అధికార ప్రతినిధి సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి, మాజీ జడ్పీ ఛైర్మన్ శరత్ చంద్రా రెడ్డి, మేడ్చల్ జిల్లా ఆర్టీఏ మెంబర్ బీమిడి జైపాల్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసి నక్క ప్రభాకర్ గౌడ్ తో కేక్ కట్ చేయించి శాలువాతో సన్మానం చేశారు. అనంతరం నక్క ప్రభాకర్ గౌడ్ ను భారీ గజమాలతో సత్కరించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా నక్క ప్రభాకర్ గౌడ్ మాట్లాడుతూ నాపై అభిమానంతో పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలియజేస్తున్నానన్నారు. మీ సహకారం, దేవుడి అండ ఉన్నంత వరకు మీ అందరికి అందుబాటులో ఉంటూ సేవా కార్యక్రమాలు చేస్తూనే ఉంటానన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరి కుటుంబ భద్రత భరోసా..

- నల్గొండ జిల్లా ఇంచార్జ్ మేకల సతీష్ రెడ్డి చేతులమీదుగా బిఫాం తీసుకున్న కోర్ర చందు నాయక్

**జయభేరి, దేవరకొండ :**




దేవరకొండ మున్సిపల్ ఎన్నికలకు దేవరకొండ పట్టణంలో 16 వార్డుకు నామినేషన్ వేసి జనసేన పార్టీ కదం తొక్కింది నలగొండ జిల్లా ఇంచార్జ్ మేకల సతీష్ రెడ్డి చేతుల మీదుగా బీఫామ్ అందుకున్న దేవరకొండ నియోజవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ కొర్ర చందు నాయక్. అనంతరం చందు నాయక్ మాట్లాడుతూ.. దేవరకొండ 16వ వార్డుకు జనసేన పార్టీ గాజు గ్లాస్ గుర్తుతో జనసేన పార్టీ రంగంలో దిగింది జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ సిద్ధాంతాలే ఆదర్శంగా అవినీతి రహిత పాలనకై యువత రాజకీయాల్లోకి రావాలనే స్ఫూర్తితో మీ ముందుకు వస్తున్నాను.

మీ ఆశీర్వాదంతో నేను గెలిచి మన వార్డుకు నేను చేయాల్సిన పనులు తాగునీటి పారిశుద్ధ్యం, రోడ్డు, మౌలిక వసతులు, ప్రభుత్వ ఆరోగ్య పథకాలు ప్రతి ఒక్కరికి అందేలా, మహిళా గౌరవం సాధికరత, యువత, ఉపాధి, బలహీన వర్గాల సంక్షేమం, పారదర్శక మరియు ప్రజా పాలన, ప్రత్యేక హామీగా ప్రతి ఒక్కరి కుటుంబ భద్రత భరోసా కోసం జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ప్రవేశ పెట్టిన ఐదు లక్షల రూపాయల ఇన్సూరెన్స్ సభ్యత్వం ఉచితంగా ఇప్పించడం, జనసేన పార్టీ సిద్ధాంతం కులం మతం చూడకుండా సమాన న్యాయం, మీ బిడ్డగా నేను గెలిస్తే మన వార్డులో అడబిడ్డ పుడితే మేనమామగా 5000 రూపాయలు కానుకగా, మన వార్డులో ఆడపడుచు పెళ్లికి తమ్ముడిగా 5000 రూపాయలు కానుక, దురదృష్టవ శాత్తు ఎవరైనా మరణిస్తే కుటుంబ సభ్యుడిగా 5000 రూపాయలు ఆర్థిక సహాయం, ఒక క్వింట బియ్యం కోర్ర చందర్ లాల్ చందు నాయక్ గాజు గ్లాస్ గుర్తుకే మీ అమూల్యమైన ఓటు వేసి గెలిపించగలరని తెలియజేసినారు.

# ఒంటరితనమే విజయ రెడ్డి విషాదానికి కారణమా?

**జయభేరి, హైదరాబాద్, ఫిబ్రవరి 3 :**



హైదరాబాద్ చర్లపల్లిలో సాఫ్ట్ వేర్ ఇంజినీర్ విజయ రెడ్డి తన ఇద్దరు పిల్లలతో కలిసి ఆత్మహత్య చేసుకున్న ఘటన సమాజాన్ని ఉలిక్కిపడేలా చేసింది. అన్నీ ఉన్నా అనురాగం పంచే వారు దగ్గర లేరన్న ఆవేదన, ఒంటరితనం ఒక నిండు ప్రాణాన్ని, ఇద్దరు చిన్నారుల భవిష్యత్తును చిదిమేసింది.సాధారణంగా ఆత్మహత్యల వెనుక ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ కలహాలు లేదా తీవ్ర అనారోగ్యం వంటి కారణాలు కనిపిస్తాయి. కానీ, చర్లపల్లిలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ విజయ రెడ్డి (40) తన ఇద్దరు పిల్లలతో కలిసి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న ఘటన వీటన్నింటికీ భిన్నంగా కనిపిస్తోంది. విజయ రెడ్డి విద్యావంతురాలు, సమాజంలో మంచి గౌరవం ఉన్న వృత్తిలో ఉన్నారు. భర్త దుబాయ్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా స్థిరపడ్డారు. ఆర్థికంగా ఎటువంటి లోటు లేదు. కానీ, ఆమె తీసుకున్న ఈ కఠిన నిర్ణయం ఇప్పుడు అనేక సామాజిక, మానసిక ప్రశ్నలను లేవనెత్తుతోంది. ప్రాథమిక దర్యాప్తు ప్రకారం, విజయ రెడ్డి ఆత్మహత్యకు ప్రధాన కారణం తీవ్రమైన ఒంటరితనం . భర్త విదేశాల్లో ఉండటం, పిల్లలు హాస్టల్‌లో ఉండి చదువుకోవడం వల్ల ఆమె ఇంట్లో ఒంటరిగా గడపాల్సి వచ్చేది. తల్లి ఉన్నా ఆవిడ వయసు మీద పడడంతో ఒంటరిననే భావన ఉండిపోయింది. గోడల మధ్య మౌనం, పలకరించే మనుషులు లేకపోవడం ఆమెను డిప్రెషన్‌లోకి నెట్టి ఉండొచ్చని నిపుణులు భావిస్తున్నారు. “అన్నీ ఉన్నా.. ఎవరూ లేరు” అనే భావన మనిషిని మానసికంగా కృంగదీస్తుంది. అది చివరకు ప్రాణాలు తీసుకునేంత తీవ్రమైన నిర్ణయానికి దారితీసింది.ఈ కేసులో అందరినీ కలిచివేస్తున్న అంశం.. ఇంటర్మీడియట్ చదువుతున్న ఇద్దరు పిల్లల మరణం. యుక్తవయసులో ఉన్న పిల్లలు తల్లి నిర్ణయాన్ని ఎందుకు అడ్డుకోలేకపోయారు? తల్లిపై ఉన్న అమితమైన ప్రేమా? లేక తల్లి మానసిక స్థితిని చూసి వారు కూడా భయపడ్డారా? హాస్టల్ నుండి వచ్చిన పిల్లలు తల్లి వేదనను గుర్తించలేకపోయారా? లేక తల్లి తన బాధను వారి ముందు కూడా దాచిపెట్టిందా?సాధారణంగా తల్లులు తమ పిల్లల భవిష్యత్తు కోసం ఎన్ని కష్టాలనైనా ఓర్చుకుంటారు. కానీ, ఇక్కడ తల్లి తనతో పాటు పిల్లలను కూడా తీసుకెళ్లాలని నిర్ణయించుకోవడం వెనుక “నేను లేకపోతే నా పిల్లలు అనాథలవుతారు, వారిని ఎవరు చూసుకుంటారు?” అనే అభద్రతా భావం ఉండి ఉండవచ్చు. ఈ ఘటన నేటి హైప్రొఫైల్ ఉద్యోగస్తుల జీవితాల్లోని చీకటి కోణాన్ని ఆవిష్కరిస్తోంది. టెక్నాలజీ పెరిగినా మనుషుల మధ్య నేరుగా మాట్లాడే సమయం తగ్గిపోయింది. వీడియో కాల్స్, మెసేజ్‌లు గుండె లోతుల్లోని బాధను తుడిచివేయలేవు. ఉమ్మడి కుటుంబాలు లేకపోవడం వల్ల కష్టసుఖాలను పంచుకునే పెద్దలు ఇంట్లో ఉండటం లేదు. కెరీర్ రేసులో పడి మానసిక ఆరోగ్యాన్ని విస్మరించడం ప్రాణాంతకంగా మారుతోంది.దర్యాప్తు పూర్తి అయితే తప్ప ఈ మరణం వెనుక ఉన్న అసలైన చిక్కుముడులు విడిపోవు. అయితే, విజయ రెడ్డి మరణం సమాజానికి ఒక పెద్ద పాఠం. పక్క ఇంట్లో ఏం జరుగుతుందో తెలియని నగర జీవనంలో, మనుషుల మధ్య ఆత్మీయతలు పలచబడుతున్నాయి. ఒక వ్యక్తికి ఆర్థిక స్థిరత్వం కంటే కూడా ‘ఎవరైనా నాకు తోడున్నారు’ అనే భరోసా ముఖ్యం. “ఆత్మహత్య అనేది సమస్యకు పరిష్కారం కాదు, అది మరో వంద సమస్యలకు ఆరంభం.”విజయ రెడ్డి తీసుకున్న నిర్ణయం ఆమె కుటుంబంలో తీరని శోకాన్ని మిగిల్చింది. తోటి మనుషుల బాధను గుర్తించడం, ఒంటరిగా ఉన్న వారికి అండగా నిలబడటం మనందరి బాధ్యత.

# బీఆర్ఎస్ అభ్యర్థుల ప్రకటన

- **షాద్ నగర్ మున్సిపల్ ఎన్నికల అభ్యర్థుల వివరాలు ప్రకటించిన మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్**

**జయభేరి, షాద్ నగర్, ఫిబ్రవరి 03 :**




రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ మున్సిపాలిటీ ఎన్నికల నేపథ్యంలోబి ఆర్ ఎస్ పార్టీ అభ్యర్థుల జాబితాను మాజీ ఎమ్మెల్యే యాదవ్ మంగళవారం ప్రకటించారు. ఆయన చేతిలో మినగా 28 మంది బెడుతులకు పార్టీ బీఫాం అందజేశారు.

**అభ్యర్థుల జాబితా...**

01 గౌస్ జానీ, 02 చెట్ల నరసింహ, 03 నందారం అశోక్ యాదవ్, 04 చల్లవాని పాండురంగారెడ్డి, 05 అశ్విన్ ప్రవీణ్, 06 రాజేందర్ సింగ్, 07 ఈశ్వర్ రాజు, 08 - బిక్షపతి, 09 చేగురి వేణుగోపాల్, 10 చేరక అఖిల, 11 పిల్లి శారద, 12 ఎంఎస్ నటరాజన్, 13 కొండ లక్ష్మీ మహేష్, 14 బచ్చలి నరసింహ, 15 కుందుటి మహేశ్వరి, 16 ఒగ్గు జయలక్ష్మి కిషోర్, 17 గౌసియా బేగం సలీం, 18 ప్రేమలత యుగంధర్, 19 ఆల్ఫా బేగం అడ్డు, 20 పినమోని గోపాల్, 21 జీటీ వసంత శీను, 22 నడికూడా అనిత రఘునాథ్, 23 ఈగ వెంకట్రాంరెడ్డి, 24 జయంతి రాఘవేందర్, 25 నక్కల వెంకటేష్, 26 ఎస్పీ శివ, 27 జూపల్లి శంకర్, 28. చేగురి లక్ష్మీప్రసన్న వేణు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ మాట్లాడుతూ.. ప్రజల పక్షాన నిలబడి ప్రజల కోసం పోరాడాలని సంకల్పంతో పార్టీ స్థాపించిన ఒక నాటి నుండి నేటి వరకు పనిచేస్తుందని ప్రతి ఒక్కరు ప్రజల బాగోగులు తెలుసుకొని ప్రజల సంక్షేమం కోసం కృషి చేయాలని అన్నారు. పార్టీలో ప్రతి ఒక్కరికి ఉన్నత అవకాశాలు ఇంకా ముందు ముందు అందరిని దృష్టిలో పెట్టుకుని న్యాయం చేస్తామని ప్రతి ప్రతి నాయకుడిని కాపాడుకుంటామని అందరూ కలిసిమెలిసి షాద్ నగర్ మున్సిపల్ ఎన్నికల్లోబీ ఆర్ ఎస్ పార్టీ విజయం ఘన విజయం సాధించాలని అన్నారు. అభ్యర్థులు ప్రజలను మరి సమస్యలను అడిగి తెలుసుకొని సమస్యల పరిష్కారానికి మార్గం చూపే దిశగా పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండి పనిచేయాలని పులుసూచనలు చేశారు.

# ఛలో ఢిల్లీ ధర్నాను సక్సెస్ చేయాలి

- **పిఆర్ టియుటిఎస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు లయన్ అశ్విని చంద్రశేఖర్**

**జయభేరి, దేవరకద్ర :**




ప్రభుత్వ సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 5న నిర్వహించే ఛలో ఢిల్లీ ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పీఆర్ టియు టిఎస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు లయన్ అశ్విని చంద్రశేఖర్ మంగళవారం పిలుపు నిచ్చారు. మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర మండలం లక్ష్మీపల్లిలో మంగళ వారం ఛలో ఢిల్లీ గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లయన్ అశ్విని చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రభుత్వ సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులకు మారిన ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)ను సత్వరమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్ (పిఆర్ టియుటిఎస్), ఆల్ ఇండియా జాయింట్ యాక్షన్ కమిటీ ఆఫ్ టీచర్స్ ఆర్గనైజేషన్స్ (ఎఐ జె ఎసిటిఓ), ఆల్ ఇండియా ఫెడరేషన్ ఆఫ్ టీచర్స్ ఆర్గనైజేషన్ (ఎఐఎఫ్ టిఓ) ల పిలుపు మేరకు ఈ నెల 5న ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఆ రోజు ఉదయం 10 గంటల నుంచి ధర్నా ప్రారంభమవుతుందని అన్నారు. ధర్నాను విజయవంతం చేసేందుకు గాను ఇప్పటికీ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి నేతృత్వంలోని పిఆర్ టియుటి ఎస్ రాష్ట్ర అధ్యక్షులు పులగం దామోదర్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిక్షం గౌడ్ లతో కూడిన బృందం ఢిల్లీ కి చేరిందని తెలిపారు. జిల్లా అధ్యక్షులు మదన్ మోహన్ యాదవ్, ప్రధాన కార్యదర్శి జి.సుధాకర్ రెడ్డి, గౌరవ అధ్యక్షులు బుచ్చారెడ్డి ల ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో ఉపాధ్యాయులు ఢిల్లీ ధర్నాకు తరలి వెళ్తున్నట్లు తెలిపారు. ఛలో ఢిల్లీ కార్యక్రమానికి ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో తరలి రావాలని ఈ సందర్భంగా చంద్రశేఖర్ కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కె.మురళి ధర్, నాగేశ్వర్ రెడ్డి, మదన్ మోహన్ , బి.శ్రీనివాస్ రావు, కావాలి సుజాత తదితరులు పాల్గొన్నారు.

# చైర్మన్ పీఠం హస్తగతం చేసుకుంటాం

- **కాంగ్రెస్ సీనియర్ నాయకుడు శంకర్ ముదిరాజ్**

**జయభేరి, మేడ్చల్ :**



కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలుపిస్తాయని మేడ్చల్ డివిజన్ సీనియర్ నాయకుడు శంకర్ ముదిరాజ్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎల్లంపేట్ మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అత్యధిక స్థానాలను కైవసం చేసుకుని చైర్మన్ పీఠాన్ని హస్తగతం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. నిత్యం ప్రజలలో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటాలు చేసే నాయకులు కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థులుగా టికెట్లు కేటాయించి బరిలో ఉన్నారని, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అందిస్తున్న ప్రజాపాలనకు ప్రజల నుండి మంచి ఆదరణ ఉందన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో ఓటర్లు అధికార పార్టీ వైపు ఉన్నారని, ఎల్లంపేట్ మున్సిపాలిటీ లోని 24 స్థానాలను కాంగ్రెస్ పార్టీ గెలుపు సాధిస్తుందన్నారు. 10 సంవత్సరాల బిఆర్ఎస్ పాలనలో చేసిన అభివృద్ధి ఏమి లేదని కెసిఆర్ రాష్టాన్ని అప్పుల ఊబిలో ముంచిందని శంకర్ ముదిరాజ్ విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన రెండు సంవత్సరాలలో లక్ష ఉద్యోగాలు, ఇందిరమ్మ ఇల్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500 లకు గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల విద్యుత్, రేషన్ కార్డుల పంపిణీ వంటి సంక్షేమ పథకాలు అమలు చేస్తుందన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు తమ ప్రాంత అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు మద్దతుగా ప్రజలు హస్తం గుర్తుకు ఓటు వేసి అధికార పార్టీకి పట్టం కట్టాలని కోరారు.



## బిఆర్ ఎస్ పార్టీలో చేరిన యండి లతీఫ్

**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ మున్సిపాలిటీ పరిధిలోని 19వ వార్డుకు చెందిన యండి లతీఫ్ బిఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు,దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ సమక్షంలో బిఆర్ఎస్ పార్టీలో చేరారు.పార్టీలో చేరిన వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీ ఎన్నికలలో బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఎన్నికల ఇంచార్జీ పాల్వాయి స్రవంతి, రాష్ట్ర నాయకులు కేతావత్ బిల్యా నాయక్,నేనావత్ కిషన్ నాయక్, 19 వార్డు కౌన్సిలర్ అభ్యర్థి ఖాదర్ బాబా తదితరులు పాల్గొన్నారు.


## సమయపాలన పాటించని మండల అధికారులు

**జయభేరి, తుర్కపల్లి, ఫిబ్రవరి 03 :**

తుర్కపల్లి మండల కేంద్రంలోని పలు ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు సమయపాలన పాటించడం లేదని సిపిఐ మండల కార్యదర్శి సిల్వేరు దుర్గయ్య ఆరోపించారు. మంగళవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాల్లో 12 దాటిన తర్వాత అధికారులు ఉండడం లేదని ప్రజలు తమకు ఎదురయ్యే సమస్యల పరిష్కారం కొరకు కార్యాలయాల కు వస్తే అధికారులు లేరని అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో ఉన్న టాయిలెట్ సౌకర్యం సరిగ్గా లేవని వాటిని పరిష్కరించాలని అన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో నెలకొన్న ప్రజా సమస్యలను పరిష్కరించే విధంగా అధికారులు పాటుపడాలని కోరారు.

## రావల్ కోల్ లో జోరుగా బిఆర్ఎస్ ప్రచారం

- **పాల్గొన్న ఎమ్మెల్యే మల్లారెడ్డి**



**జయభేరి, మేడ్చల్ :**

60 సంవత్సరాల కాంగ్రెస్ పాలనలో ప్రజలకు చేసిన అభివృద్ధి శూన్యం అని మేడ్చల్ ఎమ్మెల్యే మాజీమంత్రి మల్లారెడ్డి అన్నారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎల్లంపేట్ మున్సిపాలిటీ పరిధిలోని సోమారం, రావల్ కోల్ వార్డులో బిఆర్ఎస్ కౌన్సిలర్ అభ్యర్థులకు మద్దతుగా రోడ్ షో, ర్యాలీ నిర్వహించారు. ప్రజలు కాంగ్రెస్ మాయ మాటలు నమ్మొద్దని గతంలో కేసీఆర్ చేసిన అభివృద్ధిని చూసి ఓటు వేయాలని సూచించారు. తన సొంత ఖర్చుతో మేడ్చల్ నియోజకవర్గంలోని గ్రామాలను అభివృద్ధి చేశానని గుర్తు చేశారు. ప్రజలకు సేవ చేయడానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని మల్లారెడ్డి పేర్కొన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ ఇంచార్జ్ మహేందర్ రెడ్డి, సీనియర్ నాయకులు భాస్కర్ యాదవ్, ముద్దుల శ్రీనివాస్ రెడ్డి, దాయనంద్ యాదవ్, జగన్ రెడ్డి, వెంకటేష్ ముదిరాజ్, హరత్ రెడ్డి, మహేందర్ ముదిరాజ్, కరుణాకర్ రెడ్డి, అకిటి నవీన్ రెడ్డి, రాజు నాయక్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.



## రాఘవేంద్ర నగర్ కాలనీలో అక్రమ నిర్మాణాలు

**జయభేరి, మేడ్చల్ :**

మేడ్చల్ సర్కిల్ పరిధిలోని రాఘవేంద్ర నగర్ కాలనిలో అక్రమ నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. జి+ రెండు అంతస్తులకు భావన నిర్మాణ అనుమతులు తీసుకొని కొందరు మూడు నాలుగు అంతస్తుల నిర్మాణాలు చేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఎలాంటి సెట్ బ్యాక్స్ లేకుండా చేపట్టి నిర్మాణాలను అడ్డుకోవాల్సిన టౌన్ ప్లానింగ్ అధికారులు అటువైపు కన్నెత్తి చూడటంలేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం ఒకవైపు అక్రమాలను నిర్మూలించడానికి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేస్తుంటే మేడ్చల్ సర్కిల్ లో అడ్డగోలు నిర్మాణాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. సామాన్యుడు చిన్నపాటి ఇల్లు నిర్మించుకుంటే లక్ష సాకులు వెతికే అధికారులు కొందరు బడాబాబుల ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేస్తుంటే ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఏదిఏమైనా అక్రమ నిర్మాణాలను గుర్తించి అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

## శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాల్లో తీన్మార్ మల్లన్న



**జయభేరి, తుర్కపల్లి, ఫిబ్రవరి 03 :**

తుర్కపల్లి మండలం మాదాపూర్ గ్రామంలో జరుగుతున్న శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాల్లో ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ నిర్వాహకులు ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ దేవతల ఆశీస్సులతో ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని, గ్రామ అభివృద్ధి మరింత వేగంగా జరగాలని ఆకాంక్షించారు. ప్రజలతో నేరుగా మమేకమై మాట్లాడటం తనకు ఎప్పుడు ఆనందాన్నిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సీత రాజు, తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఆలేరు నియోజకవర్గ ఇన్చార్జి కొమ్మిరి శెట్టి నరసింహులు, మాజీ జెడ్పి వైస్ చైర్మన్ ధనావత్ బిక్కు నాయక్, గ్రామస్తులు పాల్గొన్నారు.


## గ్రామంలో మంచినీటి సమస్యను పరిష్కరించాలి



**జయభేరి, తుర్కపల్లి, ఫిబ్రవరి 03 :**

తుర్కపల్లి మండలం దత్తాయ పెల్లి గ్రామంలో మంచినీటి సమస్యను పరిష్కరించాలని సర్పంచ్ జేరుపోతుల కర్ణాకర్ ఆర్ డబ్ల్యు ఎస్ అనంత్ రెడ్డిని కోరారు. మంగళవారం దత్తాయపల్లి గ్రామంలో మంచినీటి సరఫరా ప్రణాళిక రూపొందించడం కోసం గ్రామానికి వచ్చిన ఏఈకి ఓవర్ హెడ్ ట్యాంకులను చూపించి గ్రామ నీటి సమస్య పై వివరించారు. త్వరలో వచ్చే వేసవిలో గ్రామంలో మంచినీటి సరఫరా ప్రణాళిక పొందించడం జరుగుతుందన్నారు .ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ జిట్టా బాలకృష్ణ, వార్డు సభ్యులు గుంటి రాజు, కారోబర్ ఎరుకల స్వామి పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ పార్టీ నాయకులు కిషన్ నాయక్ ఆర్థిక సహాయం



**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ మున్సిపాలిటీ పరిధిలోని ఆరో వార్డుకు సంబంధించిన సిగ్నమాను శ్రీనివాస్ అనారోగ్యంతో ఇటీవల మరణించడం జరిగింది. వారి భార్య సిగ్నమాని శైలజకి బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు నేనావత్ కిషన్ నాయక్ మానవతా దృక్పథంతో 50 వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేయడం జరిగింది అలాగే భవిష్యత్తులో వాళ్ల పిల్లల విద్యకు కూడా తన వంతు సహాయం అందజేస్తానని వారికి హామీ ఇవ్వడం జరిగింది. వారి కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేయడం జరిగింది దేవరకొండ నియోజకవర్గం ప్రజలకు ఎల్లప్పుడూ కష్టనష్టాల్లో అందుబాటులో నేను ఉంటానని తెలియజేయడం జరిగింది ఇట్టి కార్యక్రమంలో కాలనీవాసులు పాల్గొన్నారు.



# 15 ఏళ్లుగా కలిసి పని చేయాలని అనుకుంటున్నాం

సూపర్ స్టార్ మహేష్ బాబుదర్శకధీరుడు రాజమౌళి కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న భారీ చిత్రం 'వారణాసి' పై అంచనాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ఇప్పటికే ఈ ప్రాజెక్ట్ గురించి దేశవ్యాప్తంగా చర్చ నడుస్తుండగా, తాజాగా మహేష్ బాబు ఇచ్చిన ఇంటర్వ్యూ మరింత ఆసక్తిని రేకెత్తించింది. సుమారు రూ.800 కోట్ల భారీ బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ సినిమా వచ్చే సంవత్సరం ఏప్రిల్ 7న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. హాలీవుడ్ మార్కెట్‌ను కూడా లక్ష్యంగా పెట్టుకుని ఈ చిత్రాన్ని అంతర్జాతీయ స్థాయిలో విడుదల చేయాలని రాజమౌళి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. 'ఆర్ఆర్ఆర్'తో గ్లోబల్ స్థాయిలో గుర్తింపు పొందిన రాజమౌళి, ఈ సినిమాను మరింత విస్తృత స్థాయిలో తీసుకెళ్లాలని భావిస్తున్నారు. ఇటీవల 'వారణాసి' గ్లింప్స్ విడుదల సమయంలో మహేష్ బాబు, ప్రియాంక చోప్రా, పృథ్వీరాజ్ సుకుమారన్‌లతో కలిసి రాజమౌళి హాలీవుడ్‌లో ప్రత్యేక ఇంటర్వ్యూలు కూడా ఇచ్చారు.

ఆ ఇంటర్వ్యూల్లో ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన పలు ఆసక్తికర విషయాలు బయటపడ్డాయి. ముఖ్యంగా కథ ఎలా ప్రారంభమైందన్న అంశంపై మహేష్ బాబు చేసిన వ్యాఖ్యలు అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. మహేష్ బాబు మాట్లాడుతూ, "ఇంతకుముందు రాజమౌళి గారు నాతో ఎప్పుడూ కథ గురించి చర్చించలేదు. దాదాపు 15 ఏళ్లుగా మేమిద్దరం కలిసి పనిచేయాలని అనుకుంటున్నాం. 'ఆర్ఆర్ఆర్' తర్వాత కూడా దాదాపు ఒక సంవత్సరం పాటు ఆయన నుంచి ఎలాంటి స్టోరీ డిస్కషన్ జరగలేదు. ఆ తర్వాత ఒకరోజు తన ఆఫీస్‌కు పిలిచి ఈ కథను నేరేట్ చేశారు. ఆ కథ విన్న వెంటనే నేను ఆశ్చర్యపోయాను" అని తెలిపారు. ఈ సినిమాలో యాక్షన్, అడ్వెంచర్, మైథాలజీ, టైమ్ ట్రావెల్ వంటి విభిన్న అంశాలు మిళితమై ఉంటాయని మహేష్ వెల్లడించారు. "రాజమౌళి గారికి నేను పెద్ద అభిమాని. ఆయన దర్శకత్వంలో ఇలాంటి విభిన్నమైన కథలో నటించడం నాకు చాలా ఆనందంగా ఉంది. సినిమా ప్రాసెస్‌లో నన్ను పూర్తిగా ఇన్‌వాల్వ్ చేయడం మరింత ప్రత్యేకం" అని చెప్పారు. ఈ వ్యాఖ్యలు సినిమా మీద ఉన్న అంచనాలను మరింత పెంచాయి. అత్యాధునిక టెక్నాలజీ, విజువల్ ఎఫెక్ట్స్, అంతర్జాతీయ స్థాయి నిర్మాణ విలువలతో ఈ చిత్రం తెరకెక్కుతోంది. మహేష్ బాబు కెరీర్‌లోనే అత్యంత భారీ ప్రాజెక్ట్‌గా నిలుస్తున్న 'వారణాసి' గ్లోబల్ బాక్సాఫీస్‌ను లక్ష్యంగా పెట్టుకుని రూపొందుతుండటంతో, ఈ సినిమా భారతీయ సినిమాకు మరో మైలురాయిగా నిలుస్తుందనే అభిప్రాయం సినీ వర్గాల్లో వ్యక్తమవుతోంది.

# లాటరీ కోటీశ్వరుడు?



సుదీర్ఘ కెరీర్‌లో అగ్ర నటుడు నాగార్జున వందో సినిమా మైలురాయిని చేరుకున్నారు. ఈ ప్రయాణంలో అనేక ప్రయోగాలు, బాక్సాఫీస్ సూపర్‌హిట్స్ ఆయన ఖాతాలో ఉన్నాయి. ఈ నేపథ్యంలో నాగార్జున వందో సినిమా కోసం ఆయన అభిమానులు ఆతృతగా ఎదురుచూస్తున్నారు. రా కార్తీక్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమాకు 'కింగ్ 100' 'లాటరీ కింగ్' అనే టైటిల్స్ ప్రచారంలో ఉన్నాయి. ఈ సినిమా కొత్త షెడ్యూల్ త్వరలో మైసూర్‌లో మొదలుకానుంది. తాజాగా ఈ సినిమా కథాంశం గురించి ఆసక్తికరమైన వార్త బయటికొచ్చింది. ఓ సాధారణ వ్యక్తి లాటరీల ద్వారా కోటీశ్వరుడిగా ఎదిగిన వైనం, ఈ క్రమంలో చోటుచేసుకునే పరిణామాల నేపథ్యంలో పవర్‌ఫుల్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారట. నాగార్జున సరికొత్త మేకోవర్‌తో కనిపించబోతున్నారని, యాక్షన్ ఘట్టాలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని సమాచారం. ఈ సినిమాలో సీనియర్ నటి టబు కీలకమైన అతిథి పాత్రలో నటించనుందట. ఈ చిత్రాన్ని మే నెలలో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.



# అందుకే అతన్ని వదిలేశా..!

కెరీర్ ఉన్నత స్థితిలో ఉన్నప్పుడు గతం తాలూకు చేదు జ్ఞాపకాలను గుర్తుచేసుకోవడం ఎవరికీ ఇష్టం ఉండదు. ముఖ్యంగా కథానాయికలు ఈ విషయంలో చాలా జాగ్రత్తలు పాటిస్తారు. కానీ మరాఠీ భామ మృణాల్ ఠాకూర్ అందుకు భిన్నం. తాజా ఇంటర్వ్యూలో మాజీ ప్రియుడి గురించి నిర్మొహమాటంగా తన అభిప్రాయాలను వ్యక్తం చేసిందీ భామ. తన వ్యక్తిగత ఇష్టాలను, స్వేచ్ఛను ఏ మాత్రం గౌరవించని వ్యక్తి కాబట్టే అతన్నుంచి దూరంగా వచ్చానని మృణాల్ ఠాకూర్ చెప్పుకొచ్చింది. 'నేను ప్రతీ విషయంలో నిర్మొహమాటంగా, దూకుడు మనస్తత్వంతో ఉంటాను. అది అతనికి నచ్చలేదు. తన పద్ధతులకు అనుగుణంగా ఉండాలని కోరుకునేవాడు. సినిమాల్లో నటించడం కూడా అతనికి ఇష్టం లేదు. అందుకే ఆ బంధం నుంచి బయటపడ్డా. బ్రేకప్ అయిపోయినందుకు ఏమాత్రం బాధపడలేదు. అతని కురచ మనస్తత్వం చూసి జాలి పడ్డాను. అలాంటి వారితో కలిసి ప్రయాణించడం చాలా కష్టం. అందుకే గుడ్‌బై చెప్పాను' అని మృణాల్ ఠాకూర్ తెలిపింది. గత కొన్ని నెలలుగా ఈ సొగసరి ప్రేమాయణం గురించి సోషల్‌మీడియాలో బాగా ప్రచారం జరుగుతున్నది. ధనుష్‌తో ఆమె ప్రేమలో ఉందని వార్తలొచ్చాయి. అయితే ఈ ప్రచారాన్ని మృణాల్ ఖండించింది. ఇద్దరం మంచి మిత్రులమని, ఆధారాలు లేని కథనాల్ని ప్రచారం చేయొద్దని కోరింది.



# దివి ఎదురు చూపులు ఎవరి కోసమో..

టాలీవుడ్ నటి అందాల ముద్దుగుమ్మ దివి వద్త్యత గురించి ఎంత చెప్పినా తక్కువే. మోడలింగ్‌తో తన కెరీర్ ను ప్రారంభించి, సినిమాల్లో చిన్న చిన్న పాత్రలు చేస్తూ తనకంటూ స్పెషల్ ఇమేజ్ క్రియేట్ చేసుకుంది. చాలా సినిమాల్లో నటించి మెప్పించింది. ముఖ్యంగా మహేష్ బాబు నటించిన మహర్షి సినిమాతో తెలుగు వెండితెర పైకి అడుగు పెట్టింది. ఈ మూవీలో మహేష్ బాబు స్నేహితురాలిగా నటించి, తన నటనతో ఆకట్టుకుంది. కనిపించింది చిన్న పాత్రలో అయినా అందరినీ తన వైపుకు తిప్పుకుంది ఈ బ్యూటీ. ఇక తర్వాత తెలుగు బిగ్ బాస్ సీజన్ 4లోకి అడుగు పెట్టి విపరీతమైన పాపులారిటీ సొంతం చేసుకుంది. హౌస్‌లో తన ఆటతీరు, అంద చందాలతో మంచి క్రేజ్ సొంతం చేసుకుంది. ఇక హౌస్ నుంచి బయటకు వచ్చిన తర్వాత ఈ అమ్మడుకు అవకాశాలు తలుపు తట్టినవి, గాడ్ ఫాదర్ సినిమాలో నటించే ఛాన్స్ కొట్టేసింది. అంతే కాకుండా చాలా సినిమాల్లో కీలక పాత్రల్లో నటించి మెప్పించింది. ఇక ఈ బ్యూటీ నిత్యం సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటూ తన అంద చందాలతో అందరినీ ఆకట్టుకుంటుంది. తాజాగా ఈ బ్యూటీ బ్లాక్ చీరలో ఉన్న ఫొటోస్ షేర్ చేస్తూ.. చెయ్యి పట్టి నడిపిస్తావా.. గుండెల్లో దాచుకుంటాను.. అంటూ క్యాప్షన్ ఇచ్చింది. ప్రస్తుతం ఈ ఫొటోస్ నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి. ఇక వీటిని చూసిన వారందరూ, దివి ఎదురు చూపులు ఎవరి కోసమో.. అంటూ కామెంట్స్ చేస్తున్నారు.

# ఓటీటీలోకి శర్వానంద్ 'నారీ నారీ నడుమ మురారి'



టాలీవుడ్ ట్యాలెంటెడ్ హీరో శర్వానంద్ నటించిన లేటెస్ట్ కామెడీ ఎంటర్‌టైనర్ 'నారీ నారీ నడుమ మురారి' థియేటర్లలో మంచి విజయాన్ని అందుకున్న తర్వాత ఇప్పుడు ఓటీటీలో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమైంది. గతంలో సామజవరగమన వంటి సూపర్ హిట్ హిలేరియస్ మూవీని తెరకెక్కించిన దర్శకుడు రామ్ అబ్బరాజు ఈ సినిమాకు దర్శకత్వం వహించగా, శర్వానంద్ సరసన సంయుక్త మేనన్, సాక్షి వైద్య హీరోయిన్లుగా నటించారు. సంక్రాంతి పండుగ సందర్భంగా జనవరి 14న విడుదలైన ఈ చిత్రం ప్రేక్షకుల నుంచి మంచి స్పందన తెచ్చుకుని బాక్సాఫీస్ వద్ద సూపర్ హిట్‌గా నిలిచింది. సంక్రాంతి బరిలో స్టార్ హీరోల చిత్రాలు ఉన్నప్పటికీ, తక్కువ బడ్జెట్‌తో రూపొందిన ఈ సినిమా కంటెంట్ బలం మీద మంచి రెస్పాన్స్ దక్కించుకొని భారీ వసూళ్లు సాధించింది. ట్రేడ్ వర్గాల సమాచారం ప్రకారం ఈ చిత్రం సుమారు రూ.20 కోట్లకు పైగా కలెక్షన్లు రాబట్టినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా శర్వానంద్ కామెడీ టైమింగ్, ఎమోషనల్ సీన్స్‌లోని నటన ప్రేక్షకులను ఆకట్టుకోగా, వీకే నరేష్ కామెడీ ట్రాక్ సినిమాకు ప్రధాన హైలైట్‌గా నిలిచింది. కుటుంబ ప్రేక్షకులను లక్ష్యంగా తీసుకుని రూపొందించిన ఈ మూవీ థియేటర్లలో నవ్వుల పండుగలా మారింది. ఇప్పుడు ఈ సూపర్ హిట్ సినిమా డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లోకి కూడా అడుగుపెట్టింది. ప్రముఖ ఓటీటీ సంస్థ అమెజాన్ ప్రైమ్ వీడియో ఈ చిత్ర డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులను సొంతం చేసుకుని, ఫిబ్రవరి 4 అర్ధరాత్రి నుంచే స్ట్రీమింగ్ ప్రారంభించింది. ఈ విషయాన్ని ప్రైమ్ వీడియో సంస్థ అధికారికంగా సోషల్ మీడియా వేదికగా వెల్లడిస్తూ కొత్త పోస్టర్‌ను విడుదల చేసింది. విశేషం ఏమిటంటే ఈ సినిమా కేవలం తెలుగులోనే కాకుండా తమిళం, హిందీ, కన్నడ, మలయాళం భాషల్లో కూడా అందుబాటులోకి వచ్చింది. ఈ చిత్రంలో వెన్నెల కిశోర్, సునీల్, సత్య, సిరి హనుమంత్, మధునందన్, సంపత్ రాజ్, రఘుబాబు, సుదర్శన్, గెటప్ శీను తదితరులు కీలక పాత్రల్లో నటించారు. అదనంగా యంగ్ హీరో శ్రీ విష్ణు స్పెషల్ క్యామియోలో కనిపించడం అభిమానులకు సర్‌ప్రైజ్‌గా మారింది. అడ్వెంచర్స్ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్, ఎకె ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌లపై రామబ్రహ్మం సుంకర ఈ చిత్రాన్ని నిర్మించగా, సంగీత దర్శకుడు విశాల్ చంద్రశేఖర్ స్వరాలు సమకూర్చారు. థియేటర్లలో ఈ హిలేరియస్ ఎంటర్‌టైనర్‌ను మిస్ అయినవారికి ఇప్పుడు మంచి అవకాశం లభించింది.

Printed and Published, Editor & Owned by **MOTHE RAGHU THIRUPATHI REDDY**, Printed at Hamara Warangal Printers and Graphics, # 25-8-182, Babuji Nagar, Kazipet, Warangal, Telangana - 506003.
Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500 039. **Cell: 9391 544 889. PRGI No: TGTEL/25/A0314.** email: **jayabherinews@gmail.com, www.jayabheridaily.com**